విశాఖపట్టణం
బుధవారం 9 సెప్టెంబర్ 2026

For a pure tomorrow..

జయ జయహే

epaper.jayajayahey.com సంపుటి: 9 సంచిక: 208 వెల: రూ.5/- పేజీలు: 8

Published From Visakapatanam Circulated by Ananthapur, Kadapa, Chittor, Srikakulam, Vijayanagaram, Thirupathi, Ongole, East, West Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool

## భోజనం ఖర్చు పెరిగింది

శాఖాహారంపై 1 శాతం పెరుగుదల

మాంసాహారంపై 5 శాతం భారం

పెరిగిన ఉల్లి, గ్యాస్, బియ్యం, నూనెల ధరలు

ఆగస్టు మాసంలో మోగిన ధరల మోత



2




## సోషల్ మీడియాను తేలిగ్గా తీసుకోవద్దు

అంతా యాక్టివ్‌గా ఉండాల్సిందే

ప్రజలకు ఎప్పటికప్పుడు వాస్తవాలు తటటలపాలి

డిఎస్సీపై దుష్ప్రచారంపై సెల్ఫీ వీడియోలు పోస్టు చేసా

లీడర్ షిప్ కాంక్లేవ్‌లో మంత్రి నారా లోకేశ్ వ్యాఖ్యలు

**(విజయవాడ - జయజయహే)**

తమ పార్టీ నేతలు సోషల్ మీడియాను సమర్ధంగా వినియోగించాలని ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి, తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ దిశానిర్దేశం చేశారు. సోషల్ మీడియానే కదా అని తేలిగ్గా తీసుకోవద్దని... ఈ విషయంపై సీరియస్‌గా ఉండాలని ఆదేశించారు. మంగళవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో రెండో రోజు లీడర్ షిప్ కాంక్లేవ్‌లో పొలిటికల్ కమ్యూనికేషన్ అండ్ పబ్లిక్ ఓరియంటేషన్ అంశంపై లోకేశ్ మాట్లాడారు. ఎంతమంది నాయకులు సోషల్ మీడియాను యాక్టివ్‌గా వినియోగిస్తున్నారని ..మిగతా 2లో

# గెలుపే లక్ష్యం





టీమ్ స్పిరిట్ తో పని చేద్దాం

అభివృద్ధితో ఓటు బ్యాంక్ పెంచుకుందాం

జెన్ జీ ఆలోచనలకు దగ్గర కావాలి

సీఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలు

టీడీపీ లీడర్షిప్ కాంక్లేవ్‌లో శ్రేణులకు మార్గదర్శకం

**(అమరావతి - జయజయహే)**

అభివృద్ధి ద్వారా ఓటు బ్యాంక్‌ను పెంచుకుందామని, ఓటేయని వారినీ మెప్పిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలను టీం స్పిరిట్‌తో ఆధార సహితంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నాయకత్వ సదస్సులో రెండోరోజు సుస్థిరాభివృద్ధిపై చర్చించారు. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని నేతలకు చంద్రబాబు సూచించారు. వచ్చే మూడేళ్లలో రూ.35,000ల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1250 నుంచి 1400 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని, నీటి లభ్యత సమస్యే కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. 'గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలను టీం స్పిరిట్‌తో ఆధార సహితంగా తిప్పికొట్టాలి. కుప్పం వెళ్లి టీచర్లను బెదిరించే స్థాయికి వైఎస్సార్సీపీ అనుకూల మీడియా దిగజారింది. ఇలా బరితెగించేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. జెన్‌జీ ఆలోచనలను పరిగణనలోకి ..మిగతా 2లో

## ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే

భాగస్వామ్యం కావాలనే టీడీపీలో చేరా

లోకేశ్ నాయకత్వంలో మరింత ముందుకు

విజయనగరం నేత చిన్న శ్రీను

వైసీపీని వీడి చంద్రబాబు సమక్షంలో టీడీపీలో చేరిక

వైఎస్సార్ సీపీ నేత బొత్సకు ఎదురు దెబ్బ

**(అమరావతి - జయజయహే)**

తెలుగుదేశం పార్టీలో వైసీపీ ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ మేనల్లుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) చేరారు. మజ్జి శ్రీనివాసరావుతో పాటు ఆయన కుమార్తె సిరి సహస్ర పసుపు కండువా కప్పుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సమక్షంలో ..మిగతా 2లో



## విశాఖ మేయర్‌గా సిరి సహస్ర?

**(విశాఖపట్నం - జయజయహే)**



గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ ఎన్నికలకు ముందు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ని వీడి తెలుగుదేశం పార్టీలో చేరిన విజయనగరం జిల్లా నేత చిన్న శ్రీను బిగ్ స్కెచ్ తో రంగంలోకి దిగినట్లు ప్రచారం జరుగుతోంది. చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర రాజకీయ భవిష్యత్తు కోసం చిన్న శ్రీను టీడీపీలో చేరారని జోరుగా ప్రచారం జరుగుతోంది. రాబోయే గ్రేటర్ విశాఖ కార్పొరేషన్ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థిగా చిన్న శ్రీను కుమార్తె సిరి సహస్ర రంగంలోకి దించే ఒప్పందం జరిగిందని సమాచారం. కాపు సామాజిక వర్గానికి చెందిన చిన్నశ్రీను భీమిలి నియోజకవర్గానికి వైసీపీ సమన్వయకర్త గా ఉన్నారు. అలాగే కాపు వర్గంలో జిల్లాకు చెందిన నేతలతో మంచి పరిచయాలు ఉన్నాయి. ఇదే సమయంలో అధికార పార్టీ గా ఉన్నప్పటికీ తెలుగుదేశం పార్టీకి విశాఖలో బలమైన మేయర్ అభ్యర్థి రెడీ గా లేరు. ఈ మేరకు సామాజిక, రాజకీయ సమీకరణాల మేరకు టీడీపీ నుంచి విశాఖ మేయర్ అభ్యర్థిగా సిరి సహస్ర రంగంలోకి దించే అవకాశం ఉందని తెలుస్తోంది.



## వైద్యవిద్యలో కీలక సంస్కరణలు

ఏఐ ఆధారిత విద్యావిధానం అమలు

తాజాగా 50 ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లు

ఎన్టీఆర్ హెల్త్ వర్సటీ ప్రకటన

**(విజయవాడ - జయజయహే)**

రాష్ట్రంలో వైద్య విద్యా ప్రమాణాలను ప్రపంచ స్థాయికి తీసుకెళ్లడం, పరిశోధనలను ప్రోత్సహించడం, అత్యవసర వైద్య సేవలను బలోపేతం చేయడమే లక్ష్యంగా కీలక సంస్కరణలు చేపడుతున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ డా. పి.చంద్రశేఖర్ తెలిపారు. విజయవాడలోని డా.ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆవరణలోని సిల్వర్ జూబ్లీ హాల్‌లో రాష్ట్ర ప్రభుత్వ వైద్య విద్యా సలహాదారు(ఎన్నారై) డా.లోకేష్ ఈదర, ప్రముఖ అనస్థీషియాలజిస్ట్ డా. కె.వి.రావులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ డా. పులాల చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఇటీవల నిర్వహించిన సర్వేలు, ఎన్ఐఆర్ఎఫ్ , న్యాక్ ర్యాంకింగ్స్‌లో రాష్ట్ర కళాశాలలు ఉత్తమ ప్రతిభ కనబరిచాయన్నారు. విశాఖపట్నంలోని ఆంధ్ర మెడికల్ కాలేజ్ ..మిగతా 2లో

## హస్తకళలకు గ్లోబల్ మార్కెట్

త్వరలో కామన్ ఫెసిటిలీ సెంటర్.. క్లస్టర్ల వారీ అందుబాటులోకి

డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు

**(అమరావతి - జయజయహే)**



హస్తకళాకారుల అభివృద్ధికి కామన్ ఫెసిలిటీ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. క్లస్టర్ల వారీగా కామన్ ఫెసిలిటీ సెంటర్ల ఏర్పాటుకు వేగంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. పార్వతీపురం మన్యం సీతంపేటలో సవర కళాకారుల సెంటర్ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. వీబీ జీ రామ్ జీ నిధులతో సవర కళాకారుల సెంటర్ నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. మదనపల్లి, అనంతపురం, పెడనల్లో సెంటర్ల కోసం స్థలాల గుర్తింపు పూర్తి చేశామని చెప్పుకొచ్చారు. త్వరలో అక్కడ నిర్మాణ పనులు ప్రారంభిస్తామని తెలిపారు. ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్ అభివృద్ధికి రూ.12 లక్షలు కేటాయించినట్లు పవన్ కల్యాణ్ ప్రస్తావించారు. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఉదయగిరి కమ్యూనిటీ సెంటర్‌కు మరమ్మతులు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రహరీ గోడ, మరుగుదొడ్లు, స్టోర్ రూమ్ నిర్మాణానికి ..మిగతా 2లో



## రూ.35కే కిలో ఉల్లి

115 రైతు బజార్లలో అమ్మకాలు

మొబైల్ కౌంటర్ల ద్వారా కూడా సరఫరా

అక్టోబర్ నాటికి వెయ్యి మీ మార్ట్‌లు

పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్

2




## దుర్గమ్మ దేవస్థానం ట్రస్టు బోర్డులో సుస్మిత

ప్రత్యేక ఆహ్వానితురాలుగా చిరు కుమార్తెకు ఛాన్స్

యాదాద్రి ఆలయ ట్రస్టు బోర్డులో చిరు సతీమణి సురేఖ

ఎమ్మెల్సీ, గ్రీన్ ఎగ్జిక్యూటివ్ బోర్డు చైర్మన్ గా నాగబాబు

మెగా ఫ్యామిలీ ఇంట పదవుల పంట

2

# ఉత్తరాంధ్ర అభివృద్ధి చంద్రబాబుతోనే



**మొదటి పేజీ తరువాయి...**

వారు టీడీపీలో చేరారు. ఇప్పటికే వైసీపీకి, విజయనగరం జిల్లా అధ్యక్ష పదవితోపాటు.. భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త పదవికి చిన్న శ్రీను రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా మజ్జి శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడారు. ఈ రోజు తెలుగుదేశం పార్టీలో తాను, తన కూతురు చేరినట్లు తెలిపారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రంలోని అభివృద్ధి, సంక్షేమం తనను ఆకర్షించడంతో తెలుగుదేశం పార్టీలో చేరానని వెల్లడించారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని తాను భాగస్వామిని కావాలనే ఆశయంతో టీడీపీలో జాయిన్ అయ్యానని వివరించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నాయకత్వంలో ఈ రాష్ట్రం మరింత ముందుకు వెళ్తుందని భావిస్తున్నానని చెప్పారు. విజయనగరం జిల్లాలో అభివృద్ధిలో భాగస్వామ్యం అవ్వాలనే టీడీపీలో చేరానని శ్రీనివాసరావు పేర్కొన్నారు.



# రూ.35కే కిలో ఉల్లి

(అమరావతి - జయజయహే)

నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కిలో ఉల్లిపాయలు రూ.32కే సర్కార్ అందించనున్నట్లు తెలిపారు. వచ్చే వారం నుంచి 115 రైతు బజార్లలో ఉల్లిపాయలను విక్రయించనున్నట్లు చెప్పారు. మొబైల్ కౌంటర్ల ద్వారా కూడా ఉల్లిపాయలు సరఫరా చేస్తామన్నారు. రేషన్‌తో కిలో కందిపప్పును సబ్సిడీపై ప్రభుత్వం అందించనుందని తెలిపారు. మార్కెట్ ధర కంటే 25-30శాతం తక్కువకు కందిపప్పు విక్రయిస్తామన్నారు. 1.20 లక్షల మెట్రిక్ టన్నుల కంది సేకరణకు కేంద్రం సహకారం అందించనున్నట్లు వెల్లడించారు. నాలుగు నుంచి ఐదు నెలల పాటు కందిపప్పును పంపిణీ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. పామాయిల్ ధరల నియంత్రణకూ కేంద్రంతో చర్చలు జరుపుతామని చెప్పారు. పీడీఎస్ బియ్యంలో 25శాతం నూకల స్థానంలో 10శాతం నూకలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఏపీ పైలట్‌ను కేంద్రం దేశవ్యాప్తంగా అమలు చేయనుందన్నారు. అక్టోబర్ 1 నాటికి వెయ్యి 'మీ మార్ట్' దుకాణాలు ప్రారంభిస్తామని.. ఇప్పటికే 870 'మీ మార్ట్' దుకాణాలు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. 64 రకాల నిత్యావసర వస్తువులు తక్కువ ధరలకు మీ మార్ట్ దుకాణాల ద్వారా అమ్మకాలు చేయనున్నట్లు తెలిపారు. 100, 250, 500 గ్రాముల చిన్న ప్యాకెట్లలో సరుకులు అందుబాటులో ఉంటాయన్నారు. రైతులకు 24 గంటల్లోనే ధాన్యం చెల్లింపులు కొనసాగుతాయని నాదెండ్ల వెల్లడించారు. 37-38 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు సిద్ధంగా ఉందన్నారు. పీడీఎస్‌లో పంచదార, పచ్చిశనగల పంపిణీ యథావిధి కొనసాగుతుందన్నారు. త్వరలో రేషన్‌తో పామాయిల్ సరఫరా చేయడమే లక్ష్యమని తెలిపారు. ఎల్పీజీ రీబుకింగ్‌కు 25 రోజుల గ్యాప్ అమల్లోకి రానుందన్నారు. విజయసాయి రాజకీయ పార్టీని మంత్రి స్వాగతించారు. ఎవరైనా పార్టీ పెట్టొచ్చన్నారు. విజయసాయిరెడ్డి రాజకీయ ప్రవేశానికి స్వాగతం పలికారు. కాగా.. రెండు రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా నేషనల్ కోపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరేని మంత్రి నాదెండ్ల మనోహర్ కలిశారు.

# కేబుల్ టీవీ.. ఇక కట్!

## డిష్ కెనెక్షన్లదీ అదే దారి.. ఓటీటీకి జనం మొగ్గు

## 66.5 కోట్లకు చేరిన సబ్ స్క్రైబర్లు

## నట్టింట సరికొత్త డిజిటల్ విప్లవం

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

ఇండియాలో ఓటీటీ వినోద రంగం ఊహించని స్థాయిలో దూసుకుపోతోంది. ప్రముఖ మీడియా కన్సల్టింగ్ సంస్థ 'ఆర్మాక్స్ మీడియా' వెల్లడించిన లేటెస్ట్ నివేదిక ప్రకారం.. ఇండియాలో ఓటీటీ ఆడియన్స్ సంఖ్య ఏకంగా 11 శాతం పెరిగి 665 మిలియన్లకు (66.5 కోట్లు) చేరుకుంది. మనదేశంలో డిజిటల్ కంటెంట్ వినియోగం ఎంత వేగంగా విస్తరిస్తుందో ఈ గణాంకాలు స్పష్టంగా చూపుతున్నాయి. ఈ ఆర్మాక్స్ నివేదికలో అత్యంత ఆసక్తికరమైన అంశం ఏమిటంటే.. కనెక్టెడ్ టీవీ యూజర్ల సంఖ్య ఏకంగా 60 శాతం పెరగడం. ఒకప్పుడు కేవలం స్మార్ట్‌ఫోన్‌లకే పరిమితమైన ఓటీటీ వినోదం.. ఇప్పుడు నేరుగా ఇళ్లలోని లివింగ్ రూమ్‌లకు చేరింది. స్మార్ట్ టీవీల ధరలు బాగా తగ్గడం, గ్రామీణ ప్రాంతాలకు కూడా హై-స్పీడ్ ఫైబర్ బ్రాడ్‌బాండ్ ఇంటర్నెట్ విస్తరించడం వల్ల ప్రజలు కేబుల్ టీవీ, డీటీహెచ్‌లకు స్వస్తి చెప్పి స్మార్ట్ టీవీల్లో ఓటీటీలు చూడటానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇండియాలో ఓటీటీ ఆడియన్స్ వేగంగా పెరగడానికి రీజినల్ కంటెంట్, ముఖ్యంగా తెలుగు, తమిళ, మలయాళ చిత్రాలు ప్రధాన కారణంగా నిలుస్తున్నాయి. థియేటర్లలో మిస్సయిన సినిమాలను కొన్ని వారాలు లేదా నెల రోజుల్లోనే ఓటీటీలో చూసే సౌకర్యం ఉండటంతో గ్రామీణ, పట్టణ ప్రాంతాల ఆడియన్స్ ఓటీటీల వైపు క్యూ కడుతున్నారు. ఆహా , ఈటీవీ విన్ లాంటి ప్రత్యేక తెలుగు ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లతో పాటు నెట్‌ఫ్లిక్స్, ప్రైమ్ వీడియో, జియోహాట్‌స్టార్, జీ5, సోనీ లివ్ లాంటి దిగ్గజ సంస్థలు ప్రాంతీయ భాషల ఒరిజినల్ వెబ్ సిరీస్‌లు, సినిమాలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయి.

### ఫ్రీ కంటెంట్‌తోపాటు పెయిడ్ సబ్‌స్క్రిప్షన్

ఇండియాలో ఓటీటీ యూజర్లలో అత్యధిక భాగం ఉచితంగా లభించే యాడ్ సపోర్టెడ్ కంటెంట్‌ను వీక్షిస్తున్నారు. అయితే కనెక్టెడ్ టీవీల వినియోగం పెరగడంతో పెయిడ్ సబ్‌స్క్రిప్షన్లు తీసుకునే ఫ్యామిలీ ఆడియన్స్ సంఖ్య కూడా గణనీయంగా పెరుగుతోందని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. రాబోయే రోజుల్లో సాంప్రదాయ టీవీ ప్రసారాల కంటే ఇంటర్నెట్ ఆధారిత కనెక్టెడ్ టీవీ స్ట్రీమింగే వినోద రంగాన్ని ఏలబోతోందని ఈ నివేదిక తేల్చిచెప్పింది. ప్రొడక్షన్ హౌస్‌లు, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లు కూడా ఇకపై టీవీ వీక్షకులను టార్గెట్ చేస్తూ కంటెంట్‌ను రూపొందించాల్సిన అవసరం ఏర్పడింది. ఒకప్పుడు కొత్త సినిమాలు వస్తుంటే ఆడియో రైట్స్, శాటిలైట్ రైట్స్ మాత్రమే ఉండేవి. ఇప్పుడు ఓటీటీ హక్కులకు వీటి కంటే ఎక్కువ డిమాండ్ ఏర్పడింది. కొన్ని స్టార్ల సినిమాలైతే షూటింగులు కూడా మొదలవక ముందే కోట్ల డిమాండ్ పలుకుతున్నాయి. తెలుగు సహా సౌత్ ఇండియా స్టార్ల సినిమాల కోసం ఇండియన్ ఓటీటీ ప్లాట్‌ఫామ్స్ భారీగా ఖర్చు చేస్తున్నాయి.

# గెలుపే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

తీసుకుంటూ రియల్‌టైమ్ నిర్ణయాలతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని' చంద్రబాబు సూచించారు. ఉచిత ఇసుక విధానంపై కూడా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలిచ్చారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు ప్రభఉత్వం ఏడాదికి రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుంటోందని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని ప్రతి ఇసుక రీచ్‌లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మద్యం విక్రయాల్లో ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా పరిష్కరిస్తే ఎమ్మెల్యేలకు మంచి బ్రాండ్ వస్తుందన్నారు. ఎల్‌నినో దెబ్బకు రాష్ట్రంలో నీటి సంక్షోభం ముంచుకొస్తోందని, అప్రమత్తంగా ఉండి పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 54 శాతం వర్షపాత లోటు నమోదైన వేళ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు 737 నుంచి 530 టీఎంసీలకు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. "జెన్‌జీ ఆలోచనలు పరిగణనలోకి తీసుకుని, నిర్ణయాలు తీసుకోవాలి. రియల్‌టైమ్ నిర్ణయాలతో దూకుడుగా జెన్‌జీ ఉంది. ఉచిత ఇసుక. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.వెయ్యి కోట్ల ఆదాయం వదులుకుని ఉచిత ఇసుక ఇస్తున్నాం. స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లోనూ మనమే గెలవాలి. సర్, రిజర్వేషన్లపై కొంతమంది కోర్టులకు వెళ్లారు. మేయర్లు, ఛైర్మన్లను ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ఎన్నుకోవాలని నిర్ణయించాం. ఎలాంటి అవకతవకలు లేకుండా చూడాలనే ఈ ప్రక్రియ చేపట్టాం." అని సీఎం చంద్రబాబు వ్యాఖ్యానించారు.

# వైద్యవిద్యలో కీలక సంస్కరణలు

**మొదటి పేజీ తరువాయి...**

జాతీయ స్థాయిలో 3వ స్థానం, రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా.. గుంటూ రు, కర్నూలు, అనంతపురం, తిరుపతి సహా ఆరు కళాశాలలు అత్యుత్తమ ర్యాంకులు సాధించాయన్నారు. విద్యార్థుల అధ్యయనం కోసం త్వరలోనే 'లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్' , కృత్రిమ మేధ ఆధారిత విద్యా విధానాన్ని యూనివర్శిటీలో అమలు చేస్తామన్నారు వీసీ. ముందుగా ప్రభుత్వ కళాశాలల్లో, అనంతరం ప్రైవేట్ కళాశాలల్లో దీనిని అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. యూనివర్సిటీలో పారదర్శక పరీక్షా విధానంతో పాటు అకడమిక్స్, రీసెర్చ్ కార్యకలాపాలకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చి వైద్య పరిశోధనలను ప్రోత్సహిస్తున్నామన్నారు. దేశంలో సగటు ఆయుర్దాయం 72 ఏళ్లకు పెరిగిన నేపథ్యంలో వయోవృద్ధుల సంరక్షణ కోసం 'జెరియాట్రిక్ మెడిసిన్', 'ఫ్యామిలీ మెడిసిన్' విభాగాల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామన్నారు డా. పి.చంద్రశేఖర్. రోగుల ప్రాణాలను కాపాడటంలో కీలకమైన అత్యవసర విభాగాన్ని బలోపేతం చేయడానికి, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ విద్యా సంవత్సరం నుంచి 19 ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 50 బీఎస్సీ ఎమర్జెన్సీ మెడిసిన్ సీట్లను ప్రారంభిస్తున్నామన్నారు. రాష్ట్రంలో వైద్య రంగాన్ని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని వీసీ తెలిపారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. టి.సాయి సుధీర్ మాట్లాడుతూ... 2026--27 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద జరుగుతున్న ఎంబీబీఎస్ ప్రవేశాల ప్రక్రియపై యూనివర్సిటీ రిజిస్ట్రార్ డా. టి. సాయి సుధీర్ వివరాలు వెల్లడించారు. కన్వీనర్ కోటా ఎంబీబీఎస్ సీట్లకు సంబంధించి ఫేజ్--× కౌన్సెలింగ్ పూర్తయిందన్నారు. తుది సీట్ల కేటాయింపులను 2026 సెప్టెంబర్ 2న విడుదల చేయగా, కేటాయించిన కళాశాలల్లో సెప్టెంబర్ 7 సాయంత్రం 4 గంటల్లోపు అభ్యర్థులు రిపోర్ట్ చేయాలని సూచించారు. మొత్తం 4,581 సీట్లలో 4,321 సీట్లు కేటాయించగా, సీట్లు పొందిన అభ్యర్థుల్లో 4,231 మంది నిర్ణీత గడువులోపు తమకు కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేశారు. మరో 90 మంది అభ్యర్థులు రిపోర్ట్ కాలేదన్నారు. ప్రస్తుతం ఫేజ్--×× ఆలిండియా కోటా కౌన్సెలింగ్ సెప్టెంబర్ 3 నుంచి 11 వరకు కొనసాగుతోందన్నారు. ఆలిండియా కోటా కౌన్సెలింగ్ పూర్తయిన అనంతరం సెప్టెంబర్ 11 నాటికి స్టేట్ కోటా ఫేజ్--×× కౌన్సెలింగ్ ప్రారంభించేందుకు తాత్కాలికంగా ప్రతిపాదించామన్నారు. ప్రతి దశలో కొత్త వెబ్ ఆప్షన్లకు అవకాశం ఉందన్నారు. సవరించిన కౌన్సెలింగ్ విధానం ప్రకారం ఫేజ్--××తో పాటు తదుపరి కౌన్సెలింగ్ దశల్లో కూడా అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలలకు కొత్తగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది. కొత్త ప్రభుత్వ ఉత్తర్వుల నిబంధనలకు అనుగుణంగా రూపొందించిన ఈ విధానం ద్వారా, గతంలో మాదిరిగా ఒకే దశలో ఇచ్చిన ఆప్షన్లకే పరిమితం కాకుండా, తదుపరి దశల్లో అందుబాటులోకి వచ్చే సీట్లు, కొత్త కళాశాలలు, సీట్ల పెంపుదల వంటి అవకాశాలను కూడా అభ్యర్థులు వినియోగించుకోవచ్చునన్నారు. జాతీయ వైద్య కమిషన్ (చీవీజ) నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం కొత్తగా ఎంబీబీఎస్ లో ప్రవేశం పొందిన విద్యార్థులకు సెప్టెంబర్ 15, 2026 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయన్నారు. అభ్యర్థులు తమకు నచ్చిన కళాశాలలను ఎంపిక మరియు ప్రాధాన్యత క్రమంలో వీలైనంత ఎక్కువ సంఖ్యలో, లేదా అందుబాటులో ఉన్న అన్ని కళాశాలలను ఆప్షన్లుగా నమోదు చేసుకోవాలని యూనివర్సిటీ సూచించింది. దీనివల్ల ఓపెన్ కేటగిరీలో సీటు పొందే అవకాశాలు మరింత పెరుగుతాయని తెలిపిందన్నారు. కేవలం పరిమిత సంఖ్యలో కళాశాలలను మాత్రమే ఆప్షన్లుగా ఎంచుకుంటే ఓపెన్ కేటగిరీలో సీటు పొందే అవకాశాలు తగ్గే అవకాశం ఉంటుంది

# భోజనం ఖర్చు పెరిగింది

(ప్రత్యేక ప్రతినిధి - జయజయహే)

గత (ఆగస్టు) నెలలో ఇంట్లో వండుకునే భోజనం ఖర్చు మోస్తరుగా పెరిగినట్లు ప్రముఖ రీసెర్చ్ సంస్థ క్రిసిల్ ఇంటెలిజెన్స్ తన 'రోటీ రైస్ రేట్' నివేదికలో వెల్లడించింది. టమోటా, బంగాళాదుంపల ధరలు తగ్గినప్పటికీ.. ఉల్లిపాయలు, వంట నూనెలు, ఎల్పీజీ గ్యాస్, బియ్యం ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని పేర్కొంది. ఆగస్టులో ఒక శాకాహార భోజనం సగటు ఖర్చు రూ. 29.5గా నమోదైంది. గతేడాది ఆగస్టుతో పోలిస్తే, అలాగే జులై నెలతో పోలిస్తే ఈ ధర 1 శాతం పెరిగింది. గతేడాదితో పోలిస్తే నాన్-వెజ్ థాలి ఖర్చు 5 శాతం పెరిగి రూ. 57.5కు చేరింది. చికెన్ (బ్రాయిలర్) ధరలు ఏడాది ప్రాతిపదికన 10 శాతం పెరగడం ఇందుకు కారణం. అయితే, శ్రావణ మాసం కారణంగా బ్రాయిలర్ కోళ్ల వినియోగం తగ్గి, వాటి ధరలు 4 శాతం తగ్గడంతో జులై నెలతో (రూ. 58.3) పోలిస్తే ఆగస్టులో నాన్-వెజ్ థాలి ఖర్చు 1 శాతం తగ్గింది. గతేడాది ఆగస్టులో కిలో ఉల్లిపాయల సగటు ధర రూ. 28 ఉండగా, ఈ ఏడాది ఆగస్టులో ఏకంగా 43 శాతం పెరిగి రూ. 40కి చేరింది. మార్చి-ఏప్రిల్ నెలల్లో మహారాష్ట్రలో కురిసిన అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల పంట దెబ్బతిని సరఫరా తగ్గడమే ఇందుకు కారణం. జులైతో పోలిస్తే ఒక్క ఆగస్టులోనే ఉల్లి ధరలు 17 శాతం పెరిగాయి. పెరిగిన ఇతర నిత్యావసరాలు: ఏడాది ప్రాతిపదికన వంట నూనెల ధరలు 11 శాతం, ఎల్పీజీ సిలిండర్ ధరలు 10 శాతం పెరిగాయి. కలిసొచ్చిన టమోటా, బంగాళాదుంప: టమోటా ధరలు ఏడాది ప్రాతిపదికన 28 శాతం (నెలవారీగా 7 శాతం), బంగాళాదుంపల ధరలు 12 శాతం తగ్గడం వల్ల భోజన ఖర్చు మరింత పెరగకుండా అదుపులో ఉంది.

## దుర్గమ్మ దేవస్థానం

# ట్రస్టు బోర్డులో సుస్మిత

## ప్రత్యేక ఆహ్వానితురాలుగా చిరు కుమార్తెకు ఛాన్స్

## యాదాద్రి ఆలయ ట్రస్టు బోర్డులో చిరు సతీమణి సురేఖ

## ఎమ్మెల్సీ, గ్రీన్ ఎగ్జిక్యూటివ్ బోర్డు ఛైర్మన్ గా నాగబాబు

## మెగా ఫ్యామిలీ ఇంట పదవుల పంట

(అమరావతి - జయజయహే)

ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డులో చిరంజీవి పెద్ద కుమార్తె కొణిదెల సుస్మితకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. సుస్మిత కొణిదెలను శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ట్రస్ట్ బోర్డుకు స్పెషల్ ఇన్వైటీగా(ప్రత్యేక ఆహ్వానితురాలిగా నియమిస్తూ ప్రభుత్వం మెమో జారీ చేసింది. ట్రస్ట్ బోర్డు, ఈవోకు అవసరమైన సందర్భాల్లో తన అనుభవంతో సుస్మిత సలహాలు ఇవ్వనున్నారు. ప్రధాన ఆలయ ఉత్సవాలు, జాతరల సమయంలో దేవస్థానం నిర్వహణకు సహకరించనున్నారు. ఇప్పటికే మెగా కుటుంబం నుంచి పలువురు వివిధ కీలక బాధ్యతల్లో ఉన్న నేపథ్యంలో.. ఇప్పుడు చిరంజీవి కుమార్తె సుస్మితకు ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానంలో స్పెషల్ ఇన్వైటీగా అవకాశం దక్కింది. ఇటీవల చిరంజీవి సతీమణి కొణిదెల సురేఖకు యాదాద్రి దేవస్థానం ట్రస్ట్ బోర్డులో సభ్యురాలిగా అవకాశం దక్కగా.. ఇప్పుడు ఏపీలోని ప్రముఖ పుణ్యక్షేత్రం ఇంద్రకీలాద్రిలో సుస్మితకు ప్రత్యేక ఆహ్వానితురాలిగా అవకాశం కల్పించారు. దుర్గమ్మ దేవస్థానం ట్రస్ట్ బోర్డులో సుస్మిత కొణిదెలకు ప్రత్యేక బాధ్యత.. ఆలయ ఉత్సవాలు, నిర్వహణలో తన అనుభవంతో సహకరించనున్నారు. సుస్మిత తన స్టడీస్ కంప్లీట్ అయ్యాక 'నిఫ్ట్'లో ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు చేశారు. అనంతరం ఫిల్మ్ ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చారు. రంగస్థలం, ఖైదీ నెంబర్ 150, సైరా, ఆచార్య, వాల్తేరు వీరయ్య చిత్రాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పని చేశారు. తర్వాత 'గోల్డ్‌బాక్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్' పతాకంపై 'శ్రీదేవి శోభన్‌బాబు' సినిమా నిర్మించి నిర్మాతగా మారారు. ఆ తర్వాత తన తండ్రి మన శంకర వరప్రసాద్ గారు చిత్రానికి ఒక నిర్మాతగా వ్యవహరించి హిట్ అందుకున్నారు. ఇక ఏపీ ప్రభుత్వంలో కీలక మిత్రపక్షంగా, డిప్యూటీ సీఎంగా పవన్ కల్యాణ్ బాధ్యతలు నిర్వర్తిస్తుండగా.. నాగబాబు ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్, ఎమ్మెల్సీగా కొనసాగుతున్నారు. సో మెగా ఫ్యామిలీకి ఇది చాలా మంచి టైం అనే చెప్పాలి.

# హస్తకళలకు గ్లోబల్ మార్కెట్

**మొదటి పేజీ తరువాయి...**

నిధులు విడుదల చేస్తామని తెలిపారు. ఏటికొప్పాక ఆరోగ్య కేంద్రం పనులు పునఃప్రారంభిస్తామని చెప్పారు. హస్తకళాకారుల సంక్షేమానికి మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టిసారించామని అన్నారు. హస్తకళా ఉత్పత్తులపై క్యూఆర్ కోడ్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేశామని తెలిపారు. క్యూఆర్ కోడ్‌తో కళాకారుడి వివరాలు, శ్రమకు సంబంధించిన సమాచారం అందిస్తామని అన్నారు. హస్తకళలను గ్లోబల్ మార్కెట్లకు అనుసంధానించేలా చర్యలు చేపడుతున్నట్లు పవన్ కల్యాణ్ వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఆరు ఉచిత నేత్ర వైద్య శిబిరాల్లో 1,708 మందికి పరీక్షలు చేసినట్లు వెల్లడించారు. సుమారు 93 మందికి ఉచితంగా శుక్లాల ఆపరేషన్లు చేసినట్లు చెప్పారు. 1,253 మందికి పైగా ఉచిత కళ్లద్దాల పంపిణీకి ఏర్పాట్లు చేశామని అన్నారు. హస్తకళాకారులు పస్తులు ఉండకూడదని.. పనికి ఆటంకం కలగకూడదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

## సోషల్ మీడియాను

# తేలిగ్గా తీసుకోవద్దు

**మొదటి పేజీ తరువాయి...**

అడిగారు. ఏఎంసీ, కార్పొరేషన్ చైర్మన్లు కూడా తాము చేసిన పనులను సోషల్ మీడియా ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నారని లోకేశ్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు సోషల్ మీడియా ద్వారా ప్రజలకు తెలియజేయాలని, ఓపెన్‌గా మాట్లాడాలని దిశానిర్దేశం చేశారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా సోషల్ మీడియా ద్వారా సెల్ఫీ వీడియోలతో తన సందేశాన్ని తెలియజేస్తున్నారని అన్నారు. తాను కూడా సుజ్లాన్ విండ్ ప్రాజెక్ట్‌లకు శంకుస్థాపన చేశానని, డీఎస్సీపై దుష్ప్రచారంపై సెల్ఫీ వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేశానని తెలిపారు. ఈ విషయం చిన్నదైనా, పెద్దదైనా ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలని లోకేశ్ సూచించారు. వైసీపీ పని ఎప్పుడూ తమ ప్రభుత్వంపై బురదజల్లడమేనని విమర్శించారు. జగన్ అండ్ కో దుష్ప్రచారాన్ని సోషల్ మీడియా వేదిక ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని ఆదేశించారు. పార్టీ ఆదేశాలు, కార్యక్రమాలపై సోషల్ మీడియా టీమ్స్ ఎప్పటికప్పుడు స్పందించాలని మార్గనిర్దేశం చేశారు. జగన్ మావిగన్ అంటే వైసీపీ నేతలు, కార్యకర్తలు గుడ్డిగా సమర్థిస్తున్నారని ఎద్దేవా చేశారు. అమరావతిని అంతర్జాతీయ స్థాయిలో తాము అభివృద్ధి చేస్తున్నామని... మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి లోకేశ్ దిశానిర్దేశం చేశారు.

# మంత్రి దుర్గేష్ చేతుల మీదుగా రూ.38.68 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**నిడదవోలు జయ జయహే ప్రతినిధి:**



పేద ప్రజలకు సీఎంఆర్ఎఫ్ వరప్రదాయినిగా నిలుస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలు పట్టణంలోని రోటరీ క్లబ్‌లో 85 మంది లబ్ధిదారులకు రూ.38.68 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలను మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిడదవోలు నియోజకవర్గంలో ఇప్పటివరకు సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ, ప్రత్యేక ఆర్థిక సాయం ద్వారా 1,177 మందికి రూ.8.04 కోట్ల మేర లబ్ధి చేకూర్చామని తెలిపారు. పేదలు ఆర్థిక ఇబ్బందుల కారణంగా వైద్యానికి దూరం కాకూడదన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అర్హులైన వారికి ప్రతి 15 రోజులకు నిరంతర ప్రక్రియగా ఆర్థిక సాయం అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సెప్టెంబర్ 7 నుంచి కొత్త పెన్షన్ల దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైందని, అర్హులైన వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు అందిస్తామని మంత్రి తెలిపారు. త్వరలో ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపడతామన్నారు. కార్యక్రమంలో లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వానికి, మంత్రి దుర్గేష్‌కు కృతజ్ఞతలు తెలిపారు



# ఒకే రాత్రి 8 మోటార్లు చోరీ

**తొట్టంబేడు, సెప్టెంబర్ 08, జయ జయహే**

తొట్టంబేడు: మండలంలోని విరుపాక్షపురం గ్రామ పరిధిలో సోమవారం రాత్రి గుర్తుతెలియని దుండగులు ఎనిమిది మంది రైతులకు చెందిన సబ్‌మర్సిబుల్ మోటార్లను చోరీ చేశారు. రైతులు వెంకటేష్, రమణయ్య, కాటయ్య, మనోహర్, పరమేష్‌రెడ్డి, బత్తయ్య, సుబ్రహ్మణ్యం, రమేష్‌లకు చెందిన మోటార్లను స్టార్టర్ బాక్సులు ధ్వంసం చేసి, వైర్లు కత్తిరించి ఎత్తుకెళ్లారు. మంగళవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు చోరీ జరిగినట్లు గుర్తించి ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే వర్షాభావం, తెగుళ్లతో ఇబ్బందులు పడుతున్న తమకు మోటార్ల చోరీ మరింత ఆర్థిక భారాన్ని మిగిల్చిందని తెలిపారు. ఇటీవల చిట్టత్తూరులోనూ నాలుగు మోటార్లు చోరీ కావడంతో రైతుల్లో భయాందోళనలు నెలకొన్నాయి. వరుస చోరీలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి దుండగులను పట్టుకోవాలని రైతులు కోరారు.

# 15 కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక సాయం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్08, జయ జయహే**

శ్రీకాళహస్తి: అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న శ్రీకాళహస్తి పట్టణంలోని 15 కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన రూ.22,01,238 విలువైన చెక్కులను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ పంపిణీ చేశారు. లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సీఎంఆర్ఎఫ్ సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జీ. విజయ్ కుమార్, గుమ్మడిపూడి దశరదాచారి, మిన్నల్ రవి, ఉమేష్ రావు మోరే, కాసారం రమేష్, సుబ్బయ్య, బషీర్, ఢిల్లీ బాబు, ఖాదర్ బాషా, షఫీ, షాకీర్, డీవీ నారాయణ, పోలూరు శ్రీనివాస్ రెడ్డి, జిలాని భాష తదితర టీడీపీ నాయకులు, కూటమి కుటుంబ సభ్యులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.







## ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లకు
# దరఖాస్తుల ఆహ్వానం

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 08, జయ జయహే**

శ్రీకాళహస్తి: పట్టణ పరిధిలో నూతనంగా ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లు మంజూరు చేసేందుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కే.వి. కృష్ణారెడ్డి తెలిపారు. ఈ నెల 7 నుంచి 16వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత, మత్స్యకారులు, డప్పు కళాకారులు, సాంప్రదాయ చెప్పులు తయారు చేసే కార్మికులు, కల్లుగీత కార్మికులు, ట్రాన్స్‌జెండర్లు తదితర అర్హులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అర్హులు తమ వార్డు సచివాలయంలో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందని, ఆధార్, రేషన్ కార్డు/ఆధార్ ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత పింఛన్ కేటగిరీకి సంబంధించిన ధ్రువపత్రాలను జత చేయాలని సూచించారు. సచివాలయ సిబ్బంది దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేసి, అనంతరం క్షేత్రస్థాయిలో అర్హతలను పరిశీలిస్తారని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత సాధించిన వారికి పింఛన్లు మంజూరు చేస్తామని కమిషనర్ వెల్లడించారు. అర్హులైన వారు నిర్ణీత గడువులోపు దరఖాస్తులు సమర్పించాలని కోరారు.

# చేపల తూకాల్లో అన్నీ మోసాలే...!





## ఫిషింగ్ హార్బర్లో లీగల్ మెట్రాలజీ అధికారుల ఆకస్మిక దాడులు
## 19మందిపై కేసులు నమోదు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 8, జయ జయహే**

విశాఖ ఫిషింగ్ హార్బర్ పై గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో విశాఖపట్నం లీగల్ మెట్రాలజీ డిప్యూటీ కంట్రోలర్ కే. టి. రవి కుమార్ వారి పరిధిలో ఉన్న కొంతమంది ఇన్స్పెక్టర్లతో ప్రత్యేక టీమ్ లు ఏర్పాటు చేసి అధికారులకు తనిఖీలపై ఆదేశాలిచ్చారు. తనిఖీలలో భాగంగా లీగల్ మెట్రాలజీ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఫిషింగ్ హార్బర్ లో ఉన్న చేపల వర్తకుల పై మెరుపు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో వ్యాపారస్థులు వాడుతున్న కాటాలు తనిఖీ చేసి ప్రభుత్వ ముద్రలు/సీలు లేని కాటాలు వాడుతున్నట్లు మరియు కొంతమంది వ్యాపారస్థులు కాటాలలో లొసుగుల్ని ఉపయోగించి వినియోగదారుల్ని మోసగిస్తున్నట్లు కనుగొని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ కంట్రోలర్ రవి కుమార్ మాట్లాడుతూ ఈ దాడుల్లో మొత్తం 19 కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కొంతమంది కాటాలు దాచినట్లు తెలిపారు. ఇకపై కూడా ఇలాంటి దాడులు కొనసాగిస్తామని ఎవరైనా సరే వ్యాపార నిమిత్తం కాటాలు వినియోగించాలి అంటే ఖచ్చితంగా ప్రభుత్వ సీలు /ముద్రలు ఉండాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఈ దాడుల్లో విశాఖపట్నం సిటీ ఇన్స్పెక్టర్ దామోదర నాయుడు, గాజువాక ఇన్స్పెక్టర్ రాజారమేష్, పాడేరు ఇన్స్పెక్టర్ అనూరాధ, అనకాపల్లి ఇన్స్పెక్టర్ పద్మావతి, అనకాపల్లి సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటరావ్ మరియు టెక్నికల్ అసిస్టెంట్ ఇస్మాయిల్ పాల్గొన్నట్లు తెలిపారు.



## హమారా ప్రసాద్‌ను
# చట్టపరంగా శిక్షించాలి

## ఐక్య ప్రజా సంఘాల డిమాండ్

**టెక్కలి సెప్టెంబర్ 8 జయ జయహే**

భారత రాజ్యాంగ నిర్మాత దేశ ప్రజల ఆశాజ్యోతి భారతరత్న డాక్టర్ భీమ్ రావు అంబేద్కర్ పై సామాజిక మాధ్యమాల్లో అనుచిత వ్యాఖ్యలు అసత్య ఆరోపణలు చేస్తూ భారత రాజ్యాంగాన్ని దేశ ప్రజలను అవమానించిన హమారా ప్రసాద్ పై రాజ్య ద్రోహం నమోదు చేసి చట్ట పరంగా కఠినంగా శిక్షించాలని ఐక్య ప్రజా సంఘాలు డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి లో ఆది ఆంధ్ర వీధి డాక్టర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తూ ప్రజా సంఘాల ప్రతినిధులు హమారా ప్రసాద్ పై తీవ్ర నిరసన తెలియజేశారు, ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా సమతా సైనిక దళ్ అధ్యక్షులు చల్లా రామారావు మాట్లాడుతూ హమారా ప్రసాద్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను కల్పిత నాయకుడుగా వ్యాఖ్యలు చేయడం చాలా బాధాకరమని ఇటువంటి వ్యక్తులను చట్టపరంగా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. డాక్టర్ అంబేద్కర్ ఎంత గొప్ప నాయకుడో ప్రపంచ దేశాల తోపాటు ఈ దేశ ప్రజలకు తెలుసునని ఆయన అన్నారు. హమారా ప్రసాదను తక్షణమే అరెస్టు చేయాలని ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయని పేర్కొన్నారు.

## జాతీయ యువజన ఉత్సవ క్విజ్‌లో
# ఐతం సత్తా

## అభినందించిన జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

**టెక్కలి సెప్టెంబర్ 8 జయ జయహే**



జాతీయ యువజన ఉత్సవాల్లో భాగంగా గ్రూప్ క్విజ్ లో ప్రధమ, ఆన్లైన్ క్విజ్ లో ద్వితీయ, తృతీయ స్థానాలను గెలుచుకున్న ఐతం కళాశాల విద్యార్థులను శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు. యూత్ ఫర్ వికసిత భారత్ 2047 యూత్ విజన్ ఫర్ ఎ డెవలప్మెంట్ ఇండియా నిర్వహించిన గ్రూప్ క్విజ్ పోటీల్లో ఐతం కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. క్విజ్ జీ క్యూ 14 లో కొలుసు సాయి, వెంకట సన్నిహిత్, చల్లా సాయి స్వరూప్, చిలక ప్రవల్లిక, మొగిలి వినయ్, గార దీపక్ బృందం సభ్యులు పాల్గొన్నారు. క్విజ్ క్యూ 16 లో సి మ్మ దిల్లీశ్వరి, బి తరుణ్, జి రీతిషా, తృతీయ స్థానం సంపాదించారు, దేశవ్యాప్తంగా 22 రాష్ట్రాలకు చెందిన 2349 విద్యా సంస్థల నుంచి 5590 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు, ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి వి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఏఎస్ శ్రీనివాసరావు, హెచ్ ఓ డి లు, అధ్యాపకులు , విద్యార్థులను అభినందించారు



## ఈ నెల 16 వరకు నియోజకవర్గంలో
# విద్యుత్ కోతలు విధించవద్దు

## అధికారులకు జనసేన ఇన్చార్జ్ భీమరశెట్టి రాంకీ ఆదేశం

**అనకాపల్లి:(జయ జయహే )**

సచివాలయాలకు వచ్చే ప్రజలు, విద్యుత్ కోతల వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని, జంగిల్ క్లియరెన్స్ పేరుతో కరెంట్ నిలిపివేస్తుండటంతో సేవలకు భంగం వాటిల్లుతోందని అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్చార్జి భీమరశెట్టి రాంకీ దృష్టికి వెళ్ళింది. ప్రజల ఇబ్బందులను వెంటనే గమనించిన ఆయన, సచివాలయాల వద్ద పరిస్థితులను పరిశీలించేందుకు తన ప్రతినిధులను పంపించారు. అక్కడ కంప్యూటర్లు పనిచేయక, పనులు కాక జనాలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వెంటనే, భీమరశెట్టి రాంకీ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో (ఏఇ, ఏడిఇ) స్వయంగా మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. ఈ నెల 16వ తేదీ వరకు అనకాపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా జంగిల్ క్లియరెన్స్ పేరుతో ఎలాంటి విద్యుత్ కోతలు (పవర్ కట్) విధించవద్దని ఆయన అధికారులను కోరగా, విద్యుత్ శాఖ అధికారులు కూడా ఈ మేరకు చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కారానికి కృషి చేసిన రాంకీ కి స్థానిక ప్రజలు ధన్యవాదాలు తెలిపారు.

# కిలోమీటర్లు కాదు... సురక్షిత ప్రయాణమే కొలమానం

(ప్రతాప్)

**రహదారులు దేశ ఆర్థిక ప్రగతికి రక్తనాళాల వంటివి. సరకు రవాణా, పరిశ్రమల విస్తరణ, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ చేరిక, పర్యాటక అభివృద్ధి---అన్నీ సమర్థవంతమైన రహదారి వ్యవస్థపై ఆధారపడి ఉంటాయి. గత దశాబ్దంలో భారత్ జాతీయ రహదారుల విస్తరణలో గణనీయమైన పురోగతి సాధించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారుల నెట్‌వర్క్ 2024లో 1,46,145 కిలోమీటర్లకు చేరింది---దాదాపు 60 శాతం పెరుగుదల. నాలుగు లేదా అంతకంటే ఎక్కువ వరుసల రహదారుల పొడవు కూడా 18,371 నుంచి 48,422 కిలోమీటర్లకు పెరిగింది.**



అయితే రహదారుల విస్తరణకు సమాంతరంగా భద్రత ఎంత మేర మెరుగుపడుతోంది అన్నది కీలక ప్రశ్న. 2023లో దేశంలో 4,80,583 రహదారి ప్రమాదాలు, 1,72,890 మరణాలు నమోదయ్యాయి. జాతీయ రహదారులు మొత్తం రహదారి నెట్‌వర్క్‌లో కేవలం 2.1 శాతం ఉన్నప్పటికీ, 2023లో జరిగిన ప్రమాదాల్లో 31.2 శాతం, మరణాల్లో 36.5 శాతం వాటా వాటిదే. రహదారుల విస్తరణతో పాటు వాహనాల సంఖ్య, ప్రయాణ వేగం, సరకు రవాణా పెరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణను మౌలిక సదుపాయాల అభివృద్ధిలో అంతర్భాగంగా చూడాలి.

భద్రత నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రారంభమయ్యే అంశం కాదు; అది రహదారి ప్రణాళికలోనే మొదలవ్వాలి. భూభాగం, ట్రాఫిక్ పరిమాణం, వాహనాల వేగం, పాదచారుల రాకపోకలు, ప్రమాద అవకాశాలను ముందుగానే అంచనా వేసి శాస్త్రీయంగా రూపకల్పన చేయాలి. నిర్మాణ దశలో నాణ్యమైన సామగ్రి, సరైన రహదారి పొరల మందం, నీటి పారుదల, మలుపులు, మధ్య విభజనలు, వెలుతురు, రహదారి గుర్తులు వంటి ప్రమాణాలను కచ్చితంగా పాటించాలి. నిర్మాణ నాణ్యతను మెరుగుపరచేందుకు కృత్రిమ మేధ, డ్రోన్లు, ఆధునిక నాణ్యత తనిఖీ పరికరాలను విస్తృతంగా వినియోగించాలి.

రహదారి పూర్తయిన తర్వాత ప్రజల వినియోగానికి తెరవడానికి ముందు స్వతంత్ర భద్రతా తనిఖీ తప్పనిసరి చేయాలి. ప్రమాదకర మలుపులు, కూడళ్లు, వంతెనలు, పాదచారుల దాటింపు ప్రాంతాలు, ప్రవేశ--నిష్క్రమణ మార్గాలను ప్రత్యేకంగా పరిశీలించి లోపాలను ముందుగానే సరిచేయాలి. తరచుగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి వేగ నియంత్రణ, మధ్య విభజనలు, తగిన వెలుతురు, పాదచారి వంతెనలు, అండర్‌పాస్‌లు వంటి శాశ్వత పరిష్కారాలు కల్పించాలి.



రహదారి ప్రారంభమైన తర్వాత కూడా బాధ్యత కొనసాగాలి. గుంతలు, పగుళ్లు, దెబ్బతిన్న రహదారి గుర్తులు, భద్రతా అవరోధాలు, వెలుతురు లోపాలను నిరంతరం గుర్తించి సకాలంలో మరమ్మతు చేయాలి. అధిక వేగం, మద్యం సేవించి వాహనం నడపడం, అధిక లోడింగ్, నిర్లక్ష్యపు డ్రైవింగ్ వంటి ప్రమాదకర ప్రవర్తనను సాంకేతిక ఆధారిత పర్యవేక్షణతో అరికట్టాలి.

ప్రమాదం జరిగినప్పుడు స్పందన కూడా అంతే వేగంగా ఉండాలి. అంబులెన్సులు, రహదారి గస్తీ బృందాలు, సమీప ఆసుపత్రుల మధ్య సమన్వయంతో బాధితులకు తక్షణ వైద్య సహాయం అందించాలి. అనంతరం ప్రతి ప్రమాదాన్ని డేటా ఆధారంగా విశ్లేషించి, అదే ప్రాంతంలో ప్రమాదాలు పునరావృతం కాకుండా రహదారి రూపకల్పన లేదా నియంత్రణలో అవసరమైన మార్పులు చేయాలి.

కృత్రిమ మేధ ఆధారిత పర్యవేక్షణ ఈ వ్యవస్థను మరింత సమర్థవంతం చేయగలదు. సుమారు 40,000 కిలోమీటర్ల జాతీయ రహదారులపై ఇటువంటి సాంకేతిక పర్యవేక్షణను విస్తరించే చర్యలు ప్రారంభమయ్యాయి. గుంతలు, పగుళ్లు, రహదారి గుర్తుల లోపాలు, భద్రతా అవరోధాలు, వెలుతురు లోపాలు వంటి సమస్యలను ముందుగానే గుర్తించడం ద్వారా నిర్వహణను వేగవంతం చేయవచ్చు.

రహదారుల పొడవు పెరగడం అభివృద్ధి సామర్థ్యాన్ని చూపుతుంది; వాటిపై ప్రాణనష్టం తగ్గడం అభివృద్ధి నాణ్యతను చూపుతుంది. దేశ ఆర్థిక చక్రాలు వేగంగా తిరగాలి---కానీ ఆ వేగం మనుషుల ప్రాణాల మూల్యంగా మారకూడదు. కిలోమీటర్లు పెరగడం మాత్రమే విజయ సూచిక కాదు; ప్రతి ప్రయాణికుడు సురక్షితంగా గమ్యాన్ని చేరడమే నిజమైన అభివృద్ధికి కొలమానం.

## ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌లకు సస్పెన్షన్

### సెషన్ మొత్తానికి సస్పెన్షన్ వేటు

### ఇద్దరు ఎమ్మెల్సీలపై చర్యలకు తీర్మానం

జయ జయహే:

తెలంగాణ రాజకీయాల్లో అసెంబ్లీ ఆవరణలో చోటుచేసుకున్న వివాదం మరో కీలక మలుపు తిరిగింది. శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై శాసనమండలి సస్పెన్షన్ వేటు వేసింది. ప్రస్తుత వర్షాకాల సమావేశాలు ముగిసే వరకు ఇద్దరినీ మండలి నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి ప్రకటించారు. ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేయాలని మంత్రి శ్రీధర్‌బాబు శాసనమండలిలో తీర్మానం ప్రవేశపెట్టారు. ఆ తర్వాత శాసనమండలి ఛైర్మన్ మూజువాణి పద్ధతిలో ఓటింగ్ నిర్వహించారు. తీర్మానానికి ఆమోదం లభించిన తర్వాత తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిని ప్రస్తుత సెషన్ మొత్తానికి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత మండలి సమావేశాన్ని వాయిదా వేశారు. స్పీకర్‌పై ఎమ్మెల్సీలు చేసిన వ్యాఖ్యల వ్యవహారాన్ని శాసనసభ కూడా తీవ్రంగా పరిగణించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ తీర్మానం చేసింది. తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఈ తీర్మానాన్ని శాసనసభలో ప్రవేశపెట్టారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా వ్యాఖ్యలు చేయడాన్ని శాసనసభ ఖండించింది. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. మహిళల ఎదుట అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలను కూడా సభ ఖండించింది. బీఆర్ఎస్ సభ్యుల ప్రవర్తనకు ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత వహించాలని, స్పీకర్‌కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని తీర్మానంలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని శాసనమండలి ఛైర్మన్‌కు పంపించారు. దీనిపై మండలిలో మంత్రి శ్రీధర్‌బాబు మరో తీర్మానం ప్రవేశపెట్టగా.. మూజువాణి ఓటింగ్ అనంతరం ఇద్దరు ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ నిర్ణయం వెలువడింది. అసెంబ్లీ ఆవరణలో జరిగిన ఘటనకు సంబంధించి తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలపై పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం ఉదయం వారిని అదుపులోకి తీసుకుని విచారించిన తర్వాత కోర్టులో హాజరుపరిచారు. అయితే నాంపల్లి కోర్టు పోలీసుల రిమాండ్ అభ్యర్థనను తిరస్కరించింది. వ్యక్తిగత పూచీకత్తుతో విడుదల చేయాలని ఆదేశిస్తూ.. ఒక్కొక్కరు రూ.10 వేల పూచీకత్తుతో పాటు రెండు ష్యూరిటీలు సమర్పించాలని సూచించింది. కోర్టు ఆదేశాల మేరకు ష్యూరిటీలు సమర్పించిన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు విడుదలయ్యారు. కోర్టు నుంచి విడుదలైన తర్వాత ఇద్దరు ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలు శాసనమండలికి హాజరయ్యారు. వారు సభలోకి రావడంపై అధికారపక్ష సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తాతా మధు, నవీన్ రెడ్డిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీలు డిమాండ్ చేశారు. ఈ పరిణామాల మధ్యే సస్పెన్షన్ తీర్మానం మండలి ముందుకు వచ్చింది. తమ పార్టీ ఎమ్మెల్సీలపై సస్పెన్షన్ వేటు వేయడాన్ని బీఆర్ఎస్ తీవ్రంగా వ్యతిరేకించింది. తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డిలను నిబంధనలకు విరుద్ధంగా సస్పెండ్ చేశారని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు మండలి ఆవరణలో ఆందోళన చేపట్టారు. సస్పెన్షన్‌ను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ బైఠాయించారు. ప్రభుత్వం తమ పార్టీ నేతలపై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు ఆరోపించారు.

# రికార్డు స్థాయిలో బ్యాంకింగ్ ద్రవ్య లభ్యత

## ₹6 లక్షల కోట్లకు పైగా ఉపసంహరించిన ఆర్‌బీఐ

**ముంబై, సెప్టెంబర్ 7: దేశ బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్య లభ్యత రికార్డు స్థాయికి చేరడంతో భారతీయ రిజర్వు బ్యాంకు కీలక చర్యలు చేపట్టింది. సోమవారం నిర్వహించిన రెండు ద్రవ్య ఉపసంహరణ కార్యకలాపాల ద్వారా బ్యాంకింగ్ వ్యవస్థ నుంచి రూ.6 లక్షల కోట్లకు పైగా అదనపు నిధులను ఉప సంహరించుకుంది. సెప్టెంబర్ 6 నాటికి బ్యాంకింగ్ వ్యవస్థలో మిగులు ద్రవ్య లభ్యత రూ.11.6 లక్షల కోట్లకు చేరడం ఈ చర్యకు ప్రధాన కారణంగా నిలిచింది. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ డిపాజిట్లలో దాదాపు 4 శాతానికి సమానం.**




ముందుగా 30 రోజుల కాలపరిమితితో నిర్వహించిన చరరేటు రివర్స్ రెపో వేలంలో ఆర్‌బీఐ రూ.7 లక్షల కోట్లను ఉపసంహరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకుంది. అయితే బ్యాంకుల నుంచి రూ.2.59 లక్షల కోట్ల మేర మాత్రమే బిడ్లు వచ్చాయి. ఆ మొత్తాన్ని ఆర్‌బీఐ అంగీకరించింది. అనంతరం ఒకరోజు కాలపరిమితితో మరో వేలాన్ని నిర్వహించగా, రూ.5 లక్షల కోట్లకు గాను రూ.3.53 లక్షల కోట్ల మేర బిడ్లు వచ్చాయి. మొత్తంగా రెండు కార్యకలాపాల ద్వారా రూ.6.12 లక్షల కోట్లకు పైగా నిధులు ఆర్‌బీఐ వద్దకు చేరాయి.

ఇంత భారీగా ద్రవ్య లభ్యత పెరగడానికి ప్రధాన కారణం ఇటీవల దేశంలోకి వచ్చిన భారీ విదేశీ కరెన్సీ ప్రవాహాలు. ఆర్‌బీఐ ప్రత్యేక విదేశీ మారక చర్యల ద్వారా ఆగస్టు 31 నాటికి సుమారు 136.38 బిలియన్ డాలర్లను సమీకరించింది. ఇందులో విదేశీ భారతీయుల డిపాజిట్ల ద్వారా వచ్చిన నిధులు కీలక పాత్ర పోషించాయి. ఈ విదేశీ కరెన్సీ ప్రవాహాలకు అనుగుణంగా బ్యాంకింగ్ వ్యవస్థలో రూపాయి నిధులు పెరగడంతో మిగులు ద్రవ్య లభ్యత గణనీయంగా పెరిగింది.




మిగులు నిధులు ఎక్కువకాలం వ్యవస్థలో కొనసాగితే స్వల్పకాలిక వడ్డీ రేట్లపై ఒత్తిడి పెరగడంతో పాటు ద్రవ్యోల్బణం, ఆస్తుల ధరలు, రుణాల లభ్యతపై ప్రభావం చూపే అవకాశం ఉంది. అందుకే ద్రవ్య విధానాన్ని సమతుల్యం చేయడం ఆర్‌బీఐకి ఇప్పుడు కీలక సవాలుగా మారింది.

అవసరాన్ని బట్టి మరిన్ని రివర్స్ రెపో కార్యకలాపాలు, మార్కెట్ స్థిరీకరణ పథకం బాండ్లు, ఇతర ద్రవ్య నిర్వహణ సాధనాలను ఉపయోగించే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు భావిస్తున్నాయి.

ఈ చర్య ద్వారా ఆర్‌బీఐ స్పష్టమైన సంకేతాన్ని ఇచ్చింది---బ్యాంకింగ్ వ్యవస్థలో నిధులు అధికంగా ఉన్నప్పటికీ, అవి ఆర్థిక స్థిరత్వానికి భంగం కలిగించే స్థాయికి చేరకుండా ద్రవ్య ప్రవాహాన్ని క్రమబద్ధీకరించడమే లక్ష్యం.



## ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయ నిధి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 8, జయ జయహే:

అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తున్నామని బొజ్జల బృందమ్మ తెలిపారు. శ్రీకాళహస్తి పట్టణంలో బాధితుల ఇళ్ల వద్దకే వెళ్లి 15 మంది లబ్ధిదారులకు రూ.21,39,848 విలువైన చెక్కులను బొజ్జల బృందమ్మ, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బొజ్జల బృందమ్మ మాట్లాడుతూ అనారోగ్యంతో బాధపడుతున్న వారికి ఆర్థిక సహాయం అందించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కోరగా, సీఎం సానుకూలంగా స్పందించి సహాయం అందించినట్లు తెలిపారు. పేదలను ఆదుకోవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందించడం అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ద్వారా 521 మందికి రూ.7,52,45,378 మేర ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్ క్లస్టర్ ఇంచార్జ్ పేట బాలాజీ రెడ్డి, గోపీనాథ్, నాయకులు కాసరం రమేష్,మిన్నల్ రవి గుర్రప్ప శెట్టి, ఢిల్లీ బాబు, పోలూరు శ్రీనివాస్ రెడ్డిడివి నారాయణ ,సమతమ్మ, కుమారి, అనూష ,పద్మజ, ఖాదర్ భాషా, చంద్రమ్మ, రేణుకమ్మ, కుమార్, గోవింద్, షాకీర్, మస్తాన్, ముజీబ్, బషీర్, షఫీ, ముని రాజా, ఉమేష్ రావు, సురేష్, సుజాత, చంద్రకళ, జిలాని భాష, బాబు రెడ్డి, ఆర్మగం, ప్రతాప్ ,సురేష్, చంద్ర, ఖాదర్బాషా పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వనిత లయన్స్ క్లబ్ ప్రమాణ స్వీకారం

## మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉండాలి: డాక్టర్ దశక సుబ్బారావు





**ప్రతాడేపల్లిగూడెం (జయ జయహే)**

స్థానిక బుద్దాల ఫంక్షన్ హాల్ లో డైమండ్ లయన్స్ క్లబ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా లయన్స్ జిల్లా గవర్నర్ దశక సుబ్బారావు పాల్గొన్నారు ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచంలో మహిళలు అన్ని రంగాల్లో ముందుండడం శుభ సూచకం అని సేవరంగం లో కూడా పోటీ పడటం బడుగు బలహీన వర్గాలకు సహకారం అందివ్వడం కుటుంబశీ కు అన్ని తానై సేవలు అందివ్వాడమే కాకుండా సమాజానికి కూడా మేమున్నాం అంటున్న వనితలకు వందనాలు తెలిపారు రిజియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ఏర్పాటు చేసిన నూతన వనిత లయన్స్ క్లబ్ ను ప్రారంభించిన ఎం డి. జి యల్ టి లయన్ దామర శ్రీశాంతి మాట్లాడుతూ డాక్టర్స్.. టీచర్స్ న్యాయవాదులు సామాజిక సేవకులు తో ఏర్పాటు చేసిన ఈ క్లబ్ జిల్లా లో మరిన్ని సేవలు చేస్తూ మంచి పేరు తెచ్చుకోవాలని,మా ప్రోత్సాహం ఉంటుందని తెలిపారు యల్ సి ఐ ఫ్ చైర్మన్ కాకరాల వేణుబాబు.. క్లబ్ సభ్యులు కు విధి విధానలు తెలియచేసారు ఉప గవర్నర్ లు ఆర్ వి ఎస్ సూర్యనారాయణ రాజు లయన్ వెళ్ళంకి సత్య స్వరూప్ పీడీజీ గట్టిం మాణిక్యాల రావు చుక్కా అవినాష్ రాజు లు లయన్ పుట్టా విజయశ్రీ..లయన్ సరస్వతి సుబ్బారావు లు సభ్యులు కు పిన్స్ లయన్స్ కిట్స్ అందించారు వనిత లయన్స్ క్లబ్ అధ్యక్షులు గా కిలపర్తి కావ్య సెక్రెటరీ కాళ్ళ అరుణకుమారి.. కోనా కళ్యాణి,పద్మావర్మ.. మల్లిపూడి కనక దుర్గా కొల్లి రమావతి. శ్రీ పేరి కామేశ్వరి. ఇంద్ర వాణి కర్నెని రోజా రమణి లలిత. సీతాళం లక్మి దేవి.దుగ్గిరాలరమాకుమారి డాక్టర్ నూకల దుర్గ .కొత్త సుభద్ర. కొత్త ఉమా మహేశ్వరీలు నాగలక్ష్మి. దుర్గ తదితరులు ప్రమాణం చేశారు క్లబ్ ఏర్పాటు చెసిన రీ జియన్ చైర్ పర్సన్ లయన్ పేరిచర్ల మురళీ కృష్ణంరాజు ని నాయకులు అభినందించారు మహిళ లకు చీరలు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులను సన్మానం చేశారు మెంబర్ షిప్ చైర్ పర్సన్ లయన్ కొల్లి రమావతి వైస్ ప్రసిడెంట్ లయన్ మల్లి పూడి కనక దుర్గ లు వనిత టీమ్ కి జ్ఞాపికలు అందించారు ఈ కార్యక్రమం లో లయన్స్.మృత్యుంజయ కుమార్ తమ్మా బత్తుల నాని సామన సత్తిబాబు. బత్తుల ప్రసాద్ కోటి విజయ్ కిషోర్ దుగ్గిరాల రమా కుమారి డాక్టర్ నూకల దుర్గ.. ధనలక్ష్మి. పల్లా వజ్జల రామకృష్ణ శర్మ ఆంజనేయస్వామి. సూర్యనారాయణ మూర్తి బత్తుల ప్రసాద్ రంజిత్. బాలాజీ లయన్స్ క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



### అడాకులు పంచాయతీలో

# ఇంటింటా ప్రచారం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 09,**

అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం అడాకులు పంచాయతీలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, జీసీసీ మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు.డోర్ టు డోర్ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, భవిష్యత్తులో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ముఖ్యంగా గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను వివరించారు. అలాగే ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకుని, స్థానికంగా ఉన్న రహదారులు, తాగునీరు, విద్య, వైద్యం తదితర మౌలిక వసతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా క్షేత్రస్థాయిలో కృషి చేస్తామని, ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి నిరంతరం పనిచేస్తామని పేర్కొన్నారు.

### ఛీడిపాలెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా

# శెట్టి అబ్బాయి దొర

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 09,**



కొయ్యూరు మండలం ఛీడిపాలెం పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా శెట్టి అబ్బాయి దొర బరిలోకి దిగనున్నట్లు తెలుస్తోంది.గ్రామ అభివృద్ధే లక్ష్యంగా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా తాను పోటీ చేస్తున్నట్లు ఆయన సన్నిహిత వర్గాలు తెలిపాయి. గతంలో గ్రామానికి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న మంచి పేరుతో ఆయనకు గ్రామస్థుల నుండి విశేష మద్దతు లభిస్తోంది.ఈ సందర్భంగా శెట్టి అబ్బాయి దొర మాట్లాడుతూ, సర్పంచ్ గా గెలిస్తే గ్రామంలో మౌలిక వసతుల కల్పన, రహదారులు, తాగునీరు, వీధి దీపాలు, పారిశుధ్యం వంటి సమస్యలను పరిష్కరించి ఛీడిపాలెం పంచాయతీని ఆదర్శ పంచాయతీగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. పెద్దలు, యువత, మహిళల ఆశీస్సులు, సహకారం తనకు ఉండాలని కోరారు.



### సరియవలసలో

# త్రాగునీరు బోర్‌వెల్ మరమ్మతు

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 8 జయ జయహే.**

డుంబ్రిగూడ మండలం గుంటసీమ పంచాయతీ సరియవలస గ్రామంలో త్రాగునీరు బోర్ వెల్ గత నెలరోజులు నుండి పనిచేయకుండా పోవడంతో, నీరు అందక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం డుంబ్రిగూడ మండలం ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు తామర్ల. సూర్యనారాయణ, పాంగి. సురేష్ కుమార్ దృష్టిలో ప్రజలు తీసుకొని రావడంతో, సరియవలస గ్రామంలో పర్యటించి, ఆర్ డబ్ల్యూ ఏస్ ఏఇ మహేష్ కి ఫోన్ ద్వారా పిర్యాదు చేయడం జరిగింది. వెంటనే స్పందించిన సంబందిత అధికారులు బోర్ వెల్ మరమ్మత్తు చేయడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు ఆదివాసీ గిరిజన సంఘం నాయకులకు, అధికారులకు ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం గుంటసీమ పంచాయతీ నాయకులు పాంగి. తిలక్, ప్రజలు పాల్గొన్నారు.

# జె.సి.ఐ. వీక్‌ని విజయవంతం చేయండి

## జోన్ ప్రెసిడెంట్ చైతన్య వసంతవాడ పిలుపు

**విశాఖపట్నం, సెప్టెంబర్ 8, జయ జయహే :**



జూనియర్ ఛాంబర్ ఇంటర్ నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో ఈనెల 9 వ తేదీ నుండి 15వ తేదీ వరకు జరగనున్న వారోత్సవాలని విజయవంతం చేయాలని జేసీఐ జోన్ ప్రెసిడెంట్ చైతన్య వసంతవాడ పిలుపునిచ్చారు. వారం రోజులు పాటు జెసిఐ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామని ఆయన పేర్కొన్నారు. జెసిఐ జోన్ ఫోర్ లో నాలుగు రీజియన్స్ లో 50 సంఘాల ద్వారా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ మేరకు జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ కార్యాచరణను నిర్దేశించిందని ఆయన పేర్కొన్నారు. సభ్యులంతా పాల్గొని జేసీఐ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఉచితంగా విద్యా సామగ్రి, నిత్యావసర సరుకుల పంపిణీ

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 8 .జయ జయహే.**






డుంబ్రిగూడ మండలం సొవ్వ పంచాయితీ కొరంజిగూడ గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విశాఖ ఉమ్మడి జిల్లా రాబిన్ హుడ్ ఆర్మీ ఆధ్వర్యంలో గిరిజన విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు, బియ్యం, పప్పు దినుసులు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎంఈఓ-2 గెన్ను మాట్లాడుతూ, మారుమూల గిరిజన గ్రామమైన కొరంజిగూడ కు విశాఖపట్నం నుంచి రాబిన్ హుడ్ ఆర్మీ సభ్యులు వచ్చి పేద గిరిజన విద్యార్థులను ఆదుకోవడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు ఉచితంగా విద్యా సామగ్రితో పాటు బియ్యం, పప్పు దినుసులు అందించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు గిరిజన విద్యార్థులకు ఎంతో ప్రోత్సాహాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. రాబిన్ హుడ్ ఆర్మీ సంస్థ సభ్యులు, రేణుక, ప్రసన్న, దివ్య, మాట్లాడుతూ, ఆర్థికంగా వెనుకబడిన గిరిజన కుటుంబాలకు, ముఖ్యంగా విద్యార్థులకు తమ వంతు సహాయం అందించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. మారుమూల ప్రాంతాల్లోని పేద విద్యార్థులకు అవసరమైన విద్యా సామగ్రి, నిత్యావసర సరుకులను అందిస్తూ భవిష్యత్తులో కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు.



### తాగునీటి కోసం

# గిరిజనుల అవస్థలు

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 8 జయ జయహే.**

మండలం లోని కొర్రాయి పంచాయతీ:జముగూడ గిరిజన గ్రామంలో సుమారు 50 కుటుంబాలు గత ఆరు నెలలుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. గ్రామంలోని తాగునీటిని అందిస్తున్న బోర్‌వెల్ పనిచేయకపోవడంతో మహిళలు దూర ప్రాంతాలకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.గతంలో సామాజిక కార్యకర్త, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్ చొరవ తీసుకుని బోర్‌వెల్‌కు మరమ్మతులు చేయించి గ్రామస్థులకు తాగునీటి సమస్య నుంచి ఉపశమనం కల్పించారు. అయితే ప్రస్తుతం బోర్‌వెల్ మళ్లీ పనిచేయకపోయినా ఆరు నెలలుగా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ సందర్భంగా గ్రామాన్ని సందర్శించిన సుజాత సల్మాన్ గ్రామస్థుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తాగునీటి కోసం పడుతున్న ఇబ్బందులను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వెంటనే బోర్‌వెల్‌ను మరమ్మతు చేయించడంతో పాటు శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. గిరిజన కుటుంబాల తాగునీటి సమస్యను అధికారులు అత్యవసరంగా పరిగణించి వెంటనే స్పందించి స్వచ్ఛమైన తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. తాగునీరు ప్రతి కుటుంబానికి ప్రాథమిక హక్కు అని, ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని సుజాత సల్మాన్ డిమాండ్ చేశారు.

# పింఛన్ ఆన్లైన్ దరఖాస్తు గడువు పెంచాలి

## ఎస్ బి పోతురాజు

**డుంబ్రిగూడ: సెప్టెంబర్ 8 జయ జయహే.**



డుంబ్రిగూడ:- వృద్ధప్య, వికలాంగుల, వితంతు పింఛన్ కోసం ప్రభుత్వం ఇచ్చిన ఆన్లైన్ దరఖాస్తు గడువును పెంచాలని అల్లూరి జిల్లా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎస్ బి పోతురాజు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆన్లైన్ దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం ఈనెల ఏడవ తేదీ నుంచి 16వ తేదీ వరకు గడువు ఇచ్చిందన్నారు. అయితే పింఛన్ కోసం కుల ,ఆదాయ ధ్రువపత్రాలు సమర్పించాలని ఆదేశాలు ఉండడంతో వాటిని చేసుకోవడానికి దరఖాస్తు చేసుకునే పింఛన్లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీంతోపాటు వరుసగా 12 ,13, 14న మూడు రోజులు సెలవులు రావడంతో లబ్ధిదారులకు సర్టిఫికెట్లు కూడా సకాలంలో వచ్చే అవకాశం లేదన్నారు. సర్టిఫికెట్లు సకాలంలో జరగకపోతే అర్హులైన పింఛన్ లబ్ధిదారులు నష్టపోవాల్సి ఉంటుందన్నారు.దీన్ని గమనించి ప్రభుత్వం పెన్షన్ కోసం దరఖాస్తులు చేసుకునే లబ్ధిదారులకు గడువును పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



### రేవల్లు గ్రామంలో పోలీసుల ఆధ్వర్యంలో

# అవగాహన కార్యక్రమం

**కొయ్యూరు (జయ జయహే న్యూస్) సెప్టెంబర్ 09,**

మంప పోలీస్ స్టేషన్ పరిధిలోని రేవల్లు గ్రామంలో మంగళవారం సాయంత్రం పోలీసు సిబ్బంది గ్రామ ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.రానున్న ఎన్నికల నేపథ్యంలో గ్రామ ప్రజలు ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా, శాంతియుత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియలో పాల్గొనాలని, ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా పోలీసులకు సహకరించాలని సూచించారు.అదేవిధంగా మహిళలపై నేరాలు, రోడ్డు భద్రత, గంజాయి అక్రమ రవాణా మరియు వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద లింకులు, ఫోన్ కాల్స్, మెసేజ్‌లకు స్పందించవద్దని సూచించారు.గ్రామ ప్రజలు అప్రమత్తంగా ఉంటూ, ఎటువంటి నేర సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించి, గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

For a pure tomorrow..

# ప్రజా సమస్యలపై విస్తృత ప్రచారం

## అదే వైఎస్సార్‌సీపీ విజయానికి బాసట

## రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కే. రాజశేఖర్

**విశాఖపట్నం, సెప్టెంబర్ 8, జయ జయహే**



వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కే. రాజశేఖర్ విశాఖపట్నం విచ్చేసిన సందర్భంగా ఉత్తరాంధ్ర ప్రచార కమిటీ అధ్యక్షులు జీవీ రవి రాజు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రవి రాజు మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే లక్ష్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో ప్రచార కమిటీ ఆధ్వర్యంలో విస్తృత స్థాయిలో సమావేశాలు నిర్వహిస్తామని తెలిపారు. మేధావులు, వైద్యులు, న్యాయవాదులు, రిటైర్డ్ న్యాయమూర్తులు తదితర ప్రముఖులతో చర్చలు నిర్వహించి, ప్రజా సమస్యలపై అవగాహన కల్పించే విధంగా వ్యాసాలు, ప్రచార కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించి, వైఎస్సార్‌సీపీ విజయానికి కృషి చేస్తామని తెలిపారు. ఉత్తరాంధ్రలో ప్రచార కమిటీ తరఫున పూర్తి బాధ్యతతో విస్తృతంగా పర్యటిస్తానని రవి రాజు స్పష్టం చేశారు. ముఖ్య అతిధిగా హాజరైన రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కే. రాజశేఖర్ మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో జరగనున్న మున్సిపల్, పంచాయతీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ముఖ్యంగా విశాఖపట్నం భూముల సమస్యలు, భోగాపురం విమానాశ్రయ బాధితుల సమస్యలు, విమానాశ్రయ తరలింపుతో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు, గూగుల్ డేటా సెంటర్‌కు భూముల కేటాయింపుతో ప్రభావితమైన వారి సమస్యలు తదితర అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, మేధావులు, రిటైర్డ్ న్యాయమూర్తులు, నిపుణులు, బాధితులు, ప్రజలను భాగస్వామ్యం చేస్తూ త్వరలో మేధో సదస్సు నిర్వహించి ప్రజలను చైతన్యపరిచే విధంగా కార్యక్రమాలు చేపడతామని రాజశేఖర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కళ్యాణ్‌జి. మనోజ్ కుమార్, పి. ఈశ్వర్ రావు,బోర కుమార్ రెడ్డి, సంపంగి సురేష్, దల్లి రామకృష్ణారెడ్డి, పాత్రో శ్రీనివాస్, జి. వెంకట రమణారెడ్డి, వి. ఈశ్వరరావు, సి.ఎస్. రెడ్డి, జీరి వెంకటరెడ్డి, వి. జ్యోతి ప్రకాష్, ఎస్. గణేష్ రెడ్డి, గంటా కామరాజు తదితరులు పాల్గొన్నారు. అనంతరం రాష్ట్ర ప్రచార కమిటీ అధ్యక్షులు కే. రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

# డైట్ కళాశాల విద్యార్థులకు శక్తీ అవగాహన

**రాజమహేంద్రవరం: జయ జయహే:**




ఆగష్టు 8:ఎస్పీ నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు, సౌత్ జోన్ డిఎస్పీశివప్రియఆధ్వర్యంలో, ధవళేశ్వరం పోలీస్ స్టేషన్ ఎస్సై విజయ్ కుమార్ పర్యవేక్షణలో మంగళవారం ధవళేశ్వరం డైట్ కళాశాలలో శక్తిఅవగాహనకార్యక్రమంనిర్వహించారు.సుమారు 200 మంది విద్యార్థులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై విజయ్ కుమార్ మాట్లాడుతూ, “సైబర్ నేరస్థులు మీ బలహీనతలను కాదు… మీ నిర్లక్ష్యాన్ని లక్ష్యంగాచేసుకుంటారు. అపరిచిత లింకులు, ఓటిపి లు, సోషల్ మీడియాలో వ్యక్తిగతసమాచారాన్ని పంచుకోవడం వల్ల పెద్ద నష్టాలు ఎదురవుతాయి. ప్రతి విద్యార్థి డిజిటల్ భద్రతను జీవితంలో ఒక అలవాటుగా మార్చుకోవాలి” అని సూచించారు.కార్యక్రమంలో శక్తి యాప్, మహిళలు, చిన్నారుల రక్షణ, సైబర్ నేరాలు, ఫేక్ కాల్స్, బ్యాంక్ మోసాలు, ఓటిపి ఆధార్ ఫ్రాడ్స్, ఇన్‌స్టాగ్రామ్ రీల్స్, ఫోటో మార్ఫింగ్, డ్రగ్స్ దుష్పరిణామాలు, మైనర్ డ్రైవింగ్, రోడ్డు భద్రత, పోక్సో చట్టం, వన్ స్టాప్ సెంటర్, ఎల్ హెచ్ ఎం ఎస్ సేవలు, స్వీయ రక్షణ పద్ధతులు, అలాగే అత్యవసర సహాయ నంబర్లు 100, 112, 1098, 1930పైఅవగాహన కల్పించారు.ఈకార్యక్రమంలో కళాశాలఅధ్యాపకులు, విద్యార్థులు,శక్తి టీమ్ సభ్యులు, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్ఆర్‌బిని విశాఖలోనే ఏర్పాటు చెయ్యాలని కొణతాల కేంద్రానికి లేఖ: భీశెట్టి బాబ్జి

**విశాఖపట్నం సెప్టెంబర్ 8:(జయ జయహే )**

విశాఖపట్నం కేంద్రంగానే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డుని ఏర్పాటు చెయ్యాలని కోరుతూ ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కేంద్ర రైల్వేశాఖ మంత్రి ఆశ్వని వైష్టవ్ లకు లేఖలు రాసారని ఏపీ లోక్ సత్తా రాష్ట్ర అధ్యక్షుడు భీశెట్టి బాబ్జి అన్నారు మంగళవారం విశాఖపట్నం డాబాగార్డెన్స్ వీజే ఎఫ్ ప్రెస్ క్లబ్ లో కొణతాల రామకృష్ణ రాసిన లేఖలను విడుదల చేశారు ఈ సందర్బంగా భీశెట్టి మాట్లాడుతూ దేశంలో ఎక్కడ రైల్వే జోన్ ఉందొ అక్కడే రైల్వే రిక్రూట్మెంట్ బోర్డు (ఆర్ ఆర్ బి )లు ఏర్పాటు చేసారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం రైల్వే జోన్ విశాఖపట్నం లో ఉంటే ఆర్ ఆర్ బి ని అమరావతి లో ఏర్పాటు చెయ్యమని కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయడం బాధ కలిగించిందని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతా రామరాజు జిల్లాల్లోని యువత రైల్వే లోని గ్రూప్ సి, గ్రూప్ డి ఉద్యోగాలకు నిత్యం శిక్షణ తీసుకుంటూ రైల్వే రిక్రూట్మెంట్ పరీక్షలకి హాజరువుతున్నారని ఉత్తరాంధ్ర వెనుకుబాటు తనాన్ని అర్ధం చేసుకొని ముఖ్యమంత్రి చంద్రబాబు తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని భీశెట్టి కోరారు ఇప్పటికే లోక్ సత్తా నుండి ముఖ్యమంత్రి కి లేఖ రాస్తూ రాష్ట్ర హోంశాఖ మంత్రి , బీజేపీ సీనియర్ నేత విశాఖ ఉత్తర నియోజకవర్గం ఎమ్మెల్యే పి. విష్ణుకుమార్ లకు వినతిపత్రం అందచేశామని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి. ఎన్. మాధవ్ లను కలిసి వినతి పత్రం అందచేస్తామని అన్నారు,ఉత్తరాంధ్ర లోని ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపీలు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు ఉత్తరాంధ్ర నిరుద్యోగ యువత తరపున లేఖలు రాసి వత్తిడి తేవాలని కోరారు,





# కైలాస భూమి కోసం భూదానం

## సమాజానికి చేసిన సేవే శాశ్వత సంపద

## దాతలను అభినందించిన వాసంశెట్టి సత్యం

**కాజులూరు: (జయ జయహే .)**

రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం కోలంక గ్రామంలో కైలాస భూమి ఏర్పాటుకు భూమిని విరాళంగా అందించిన బొండా శ్రీరామమూర్తి గారి మనవడు గోపాలరావు, ఉదయగిరి ముత్యాలు పిండిప్రోలు భీమశంకరంలను, రాయపాటి వారి కుటుంబంలను కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కైలాస భూమి కోసం భూదానం చేయడం గొప్ప సామాజిక సేవ అని కొనియాడారు. వ్యక్తిగత ఆస్తిని సమాజ ప్రయోజనాల కోసం త్యాగం చేయడం అరుదైన విషయం అని, దాతల సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని పేర్కొన్నారు.కైలాస భూమి ఏర్పాటుతో గ్రామ ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని, భవిష్యత్తులో గ్రామ అభివృద్ధి చరిత్రలో ఈ దాతల పేర్లు చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. గ్రామ సంక్షేమం కోసం ముందుకు వచ్చిన దాతలను గ్రామస్తుల తరఫున అభినందిస్తూ వారి సేవలను కొనియాడారు. ప్రజా ప్రయోజనాల కోసం సహకరించే ఇటువంటి మహోన్నత కార్యక్రమాలు మరింత మందికి స్ఫూర్తినివ్వాలని ఆకాంక్షించారు. సమాజ హితం కోసం భూదానం చేసిన దాతలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, వారి సేవలను ఎప్పటికీ గ్రామ ప్రజలు గుర్తుంచుకుంటారని వాసంశెట్టి సత్యం అన్నారు. ఈ కార్యక్రమంలో కోలంక గ్రామ కూటమి నాయకులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు..

# కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సిఐటియు నిరసన ర్యాలీ

**అచ్యుతాపురం సెప్టెంబర్ 7 జయ జయహే**




అచ్చుతాపురం,కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియుకు ప్రాతినిధ్యం కల్పించాలి, కేంద్ర బిజెపి ప్రభుత్వం కేంద్ర కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియు ను తొలగించడానికి నిరసిస్తూ అచ్యుతాపురంలో నిరసన తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోము నాయుడు మాట్లాడుతూ కేంద్ర కనీస వేతనాల సలహా మండలి లో సిఐటియు ఇతర కార్మిక సంఘాలను కేంద్ర ప్రభుత్వం తొలగించిందని కేంద్ర ప్రభుత్వం కార్మిక సంఘాలను తొలగించడం వలన కార్మికుల గొంతును నొక్కడం అని కనీస వేతనాల సలహా మండలిలో సిఐటియు ఇతర సంఘాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే చేర్చేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆదాని ,అంబానీ, ఇతర కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరించేందుకు కనీస వేతన సలహా మండలిలో సిఐటియును తొలగించారని ఇప్పటికే పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్స్ యజమానులకు అనుకూలంగా తీసుకొచ్చారని ఈ పద్ధతి కార్మిక వర్గానికి అన్యాయం చేయడమేనని ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కనీస వేతనాలు సలహా మండలిలో ప్రభుత్వం, కార్మిక సంఘాలు, కార్మిక శాఖ అధికారులు కలిసి వేతనాలు నిర్ణయిస్తారని అలాంటి కనీస వేతనాలు సలహా మండలి నుండి సిఐటియూ ను తొలగించడం అంటే కార్మిక వర్గ హక్కులపై దాడి అని, దేశంలో కార్మికుల సమస్యలపై పోరాడుతున్న సిఐటియూ ని పక్కకు పెట్టడం దుర్మార్గమైన చర్య కార్మిక ప్రయోజనాల కోసం పోరాడుతున్న సిఐటియూను కేంద్ర ప్రభుత్వం కనీస వేతనాల సలహా మండలి లో సిఐటియూ ను వెంటనే చేర్చాలని లేనిపక్షంలో కార్మిక వర్గాన్ని సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన తీవ్రతం చేస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నాం అని తెలిపారు .ఈ కార్యక్రమంలో కాకి రాజు, శ్రీను, దుర్గ ,సత్తిబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలతో మమేకమై బీజేపీని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలి:

## గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు పిలుపు

**ముంచంగిపుట్టు, జయ జయహే :**

స్థానిక ఎన్నికలను ఎదుర్కొనేందుకు బీజేపీ శ్రేణులు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని గిరిజన మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు పాంగి రాజారావు పిలుపునిచ్చారు. గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తూ, ప్రజలతో నిరంతరం మమేకమై కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు. మంగళవారం బీజేపీ మండల అధ్యక్షుడు కొర్ర సుబ్బారావు ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం, ‘సేవా సంకల్ప అభియాన్’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాంగి రాజారావు హాజరై పార్టీ శ్రేణులతో స్థానిక ఎన్నికల సన్నద్ధతపై చర్చించారు. అలాగే ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహించనున్న వివిధ కార్యక్రమాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా పాంగి రాజారావు మాట్లాడుతూ ‘సేవా సంకల్ప అభియాన్’ కేవలం వేడుక కాదని, ప్రజా సేవను మరింత విస్తృతం చేసే సంకల్ప కార్యక్రమమని అన్నారు. 2047 నాటికి వికసిత్ భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 17 వరకు గ్రామాల్లో ఆశీర్వాద దీపం, వ్యాసరచన, స్వచ్ఛ భారత్ తదితర తొమ్మిది కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు రెయ్యల మత్స్యరాజు, జిల్లా కార్యదర్శి వంతాల లక్ష్మణ్, మాజీ వైస్ ఎంపీపీ గబుడు సీతారాం, మాజీ ఎంపీటీసీ రెయ్యల నారాయణ, మండల ప్రధాన కార్యదర్శి రెయ్యల నాగభూషణం, కోశాధికారి చిట్టపులి సాంబశివ, మండల ఉపాధ్యక్షులు మజ్జి సాధురం, దారపు తిరుపతి, అల్లంగి రామకృష్ణ, మండల కార్యదర్శి రెయ్యల నాగార్జున, యువమోర్చా మండల అధ్యక్షుడు వంతల అర్జున్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు వనుగు కరిబాబు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# నిలిచిపోయిన రహదారి పనులు వెంటనే పూర్తి చేయాలి

## వైస్ ఎంపీపీ భాగ్యవతి డిమాండ్

**ముంచంగిపుట్టు, జయ జయహే:**

రంగబయలు పంచాయతీ దానబందు గ్రామంలో నిలిచిపోయిన రహదారి పనులను వెంటనే పూర్తి చేసి గ్రామస్తుల ఇబ్బందులను పరిష్కరించాలని మండల ప్రజా పరిషత్ ఉపాధ్యక్షురాలు సిరగం భాగ్యవతి కోరారు. గ్రామస్తుల సమాచారం మేరకు వైస్ ఎంపీపీ భాగ్యవతి మంగళవారం దానబందు గ్రామాన్ని సందర్శించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి ఎంజీఎన్ఆర్ఈజీఎస్ కింద సుమారు రూ. 2.20 కోట్ల నిధులతో రహదారి మంజూరైనప్పటికీ, పనులు అక్కడక్కడ మాత్రమే చేపట్టి అనంతరం నిలిపివేయడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని గ్రామస్తులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వర్షాకాలంలో నదులు, వాగులు ఉధృతంగా ప్రవహించే సమయంలో రహదారి, కల్వర్టులు లేకపోవడంతో విద్యార్థులు సుమారు రెండు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ పక్క గ్రామాల్లోని పాఠశాలలకు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. దీంతో విద్యార్థుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామస్తుల సమస్యలను స్వయంగా పరిశీలించిన భాగ్యవతి సంబంధిత ఇంజినీరింగ్ అధికారులతో మాట్లాడి రహదారి పనుల పరిస్థితిని వివరించారు. త్వరలో కాంట్రాక్టర్‌తో మాట్లాడి పనులను తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పనుల్లో మరింత జాప్యం జరిగితే జిల్లా కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ కార్యకర్తలు దశరథ్, గోపాల్, నర్స్ శాంతి, భీమన్నతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.




# మళ్లీ చంద్రబాబు నాయుడు రావాలి

**మునగపాక సెప్టెంబర్ 8 జయ జయహే**

మునగపాక మండల కేంద్రం మునగపాక లో మంగళవారం దాడి శివ బిలాస్రవంతి ఆధ్వర్యంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా మహిళలు మళ్లీ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలని కోరుకుంటున్నారని గ్రామ శాఖ టిడిపి అధ్యక్షుడు దాడి శివ అన్నారు ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ వెల్లూరి నూక నరసింహారావు దాడి భీముని నాయుడు ఆడారి లక్ష్మణరావు గ్రామ టిడిపి కమిటీ సభ్యులు పాల్గొన్నారు

## వైభవంగా జిల్లా ఆర్యవైశ్య సంఘం

# నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం

**విజయనగరం, సెప్టెంబర్ 8,జయ జయ హే**

విజయనగరం జిల్లా ఆర్యవైశ్య సంఘం 2026--28 సంవత్సరాల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార మహోత్సవం మంగళవారం స్థానిక సుజాత కన్వెన్షన్‌లో అత్యంత వైభవంగా జరిగింది. బత్తుల చందు సభాధ్యక్షతన, పూర్వ అధ్యక్షుడు చెరుకూరి నాగరాజు పర్యవేక్షణలో నిర్వహించిన ఈ వేడుకను వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి చిత్రపటానికి పూజలు చేసి, జ్యోతిప్రజ్వలన, ప్రార్థనా గీతంతో ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్య నూతనంగా ఎన్నికైన జిల్లా, మహిళా, యువజన విభాగాల బాధ్యులతో ప్రమాణస్వీకారం చేయించారు.

**నూతన ప్రమాణస్వీకారం చేసిన ప్రతినిధులు**

జిల్లా ప్రధాన కార్యవర్గం: బండారు చంద్రశేఖర్ (జిల్లా అధ్యక్షుడు), రవ్వా వెంకటేష్ (ప్రధాన కార్యదర్శి), గుడిశా బాలకృష్ణ (కోశాధికారి). మహిళా విభాగం రవ్వా మంజు (జిల్లా అధ్యక్షురాలు), కొల్లా భాగ్యలక్ష్మి (ప్రధాన కార్యదర్శి), గుంపిన ఇందిర (కోశాధికారి). యువజన విభాగం: తమ్మన కళ్యాణరాజు (జిల్లా అధ్యక్షుడు), కేదారిశెట్టి లక్ష్మణమూర్తి (ప్రధాన కార్యదర్శి), దేవరపల్లి కిరణ్ కుమార్ (కోశాధికారి). ఈ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ, ఆర్యవైశ్యులు తాము కష్టపడి సంపాదించిన ధనంలో కొంత భాగాన్ని సామాజిక సేవకు కేటాయించడం ఎంతో అభినందనీయమన్నారు. తమ కుటుంబం ఎల్లప్పుడూ ఆర్యవైశ్యులకు వెన్నుదన్నుగా ఉంటూ పూర్తి



సహకారాన్ని అందిస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర అధ్యక్షుడు ఇల్లూరి లక్ష్మయ్య మాట్లాడుతూ ఆర్యవైశ్యుల సంక్షేమం, హక్కుల పరిరక్షణకు మహాసభ నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు కొప్పు రావూరి రజనీ మాట్లాడుతూ ఆర్యవైశ్య మహిళలకు ఆర్థిక చేయూత, స్వయం ఉపాధి కల్పించేలా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందిస్తామన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ ఆర్యవైశ్యుల అభ్యున్నతికి నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. నూతన జిల్లా అధ్యక్షుడు బండారు చంద్రశేఖర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ, సేవా కార్యక్రమాలను విస్తరించేందుకు త్వరలోనే స్పష్టమైన ప్రణాళిక సిద్ధం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మాటూరి రంగనాథ్, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కండె నాగరాజేష్, ప్రముఖ వ్యాపారవేత్త అంబికా కృష్ణ,వైశ్య సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ కుసుమంచి సుబ్బారావు, పూర్వ అధ్యక్షులు బండారు బంగారురాజు,ఆలవెల్లి శేఖర్, కుమ్మరిగుంట శ్రీనివాసరావు,పచ్చిపులుసు ఈశ్వరరావు, డిమ్స్ రాజు, బొడ్డు సత్యనారాయణ, మడిపల్లి రామారావు, ఎస్.వి.ఎన్అధినేతలు గుడిశా శివకుమార్, శ్రీనివాసరావు, తవ్వా మోహన్ రావు విజయనగరం నగరంలోని పలు సంఘాల ప్రతినిధులు, జిల్లా నలుమూలల నుండి ఆర్యవైశ్య సభ్యులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.




## రాహుల్‌పై ఎఫ్ఐఆర్ ఎత్తివేయాలని

# కాంగ్రెస్ ధర్నా

**రాజమహేంద్రవరం: జయ జయహే: ఆగస్టు8**

ఎఐసిసి ఆదేశాలు, పిసిసి అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల సూచన మేరకు విజయవాడలో నిర్వహించిన కాంగ్రెస్ ధర్నాలోరాజమహేంద్రవరం నుంచి కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఉత్తరాఖండ్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై నమోదైన ఎఫ్ఐఆర్‌ను వెంటనే ఎత్తివేయాలని,ఎఐసిసిఅధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు క్షమాపణ చెప్పడంతో పాటు దేశ దళితులకు బిజెపి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.ధర్నాలో రాజమండ్రి పార్లమెంట్ కోఆర్డినేటర్ టికె విశ్వేశ్వరరెడ్డి, రాజమండ్రి అర్బన్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్, పిసిసి ప్రధాన కార్యదర్శి ఆకుల భాగ్యలక్ష్మి, రాష్ట్ర క్రిస్టియన్ మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి సింధుయరాణి, అర్బన్ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి సూరిబాబు, జిల్లా కార్యదర్శి డా. యాళ్ల వీరభద్రరావు తదితరులుపాల్గొన్నారు.ఈ సందర్భంగా టికె విశ్వేశ్వరరెడ్డి, బాలేపల్లి మురళీధర్, ఆకుల భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను ప్రజలు తిప్పికొట్టి, కాంగ్రెస్‌కు మరోసారి అధికార అవకాశంకల్పించాలని పిలుపునిచ్చారు.



## పేదల ఆకలి తీర్చే ప్రయత్నంలో

# అందరూ భాగస్వాములు కావాలి

**పెదకూరపాడు, సెప్టెంబర్ 8 (జయ జయహే)**

పేదల ఆకలి తీర్చే ప్రయత్నంలో ప్రతివారు భాగస్వాములు కావాలని, మిగిలిన ఆహారంతో అన్నార్తులను ఆకలి తీరుద్దామని జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు బెజ్జం నాగేశ్వరరావు అన్నారు. నియోజకవర్గ కేంద్రమైన పెదకూరపాడులో నాగమ్మ తల్లి విగ్రహ పునః ప్రతిష్ట మహోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆహారం మిగిలి ఉన్న సమాచారాన్ని చెన్నుపాటి బుల్లిబాబు జన చైతన్య సమితి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు ఫోన్ ద్వారా తెలపటంతో ఆహారాన్ని సేకరించి పెదకూరపాడు మండలంలోని 75 తాళ్లూరులోని బుడుగు జంగాల కాలనీలో పంపిణీ చేశారు.ఈసందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఫంక్షన్ ఏదైనా ఆహారం మిగిలి ఉంటే 9885557987, 8886777767, 9848977677 ఫోన్ నెంబర్లకు సమాచారం ఇవ్వాలని మిగిలిన ఆహారాన్ని వృధా కాకుండా పేదలకు పంచుతామని అన్నారు.ఈకార్యక్రమంలో జన చైతన్య సమితి బృందం డి వి బి బాబు,షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.



## ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో వినాయక ప్రతిమలు వద్దే వద్దు

### మట్టితో గణేష్ ప్రతిమలను తయారు చేయండి

### 21 పత్రి మొక్కలు నాటి వనాలు పెంచుదాం : జె వి రత్నం

**విశాఖపట్నం (జయ జయహే)**

ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో వినాయక ప్రతిమలు వద్దే వద్దు అని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాప కార్యదర్శి జే వి రత్నం పిలుపునిచ్చారు. మంగళవారం ఉదయం పెదవాల్తేరు లోని కేడీపీఎం హైస్కూల్లో హెచ్ఎం సుమతిబాయి అధ్యక్షతన ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ లు మట్టితో వినాయక ప్రతిమలు తయారు చేసిన తర్వాత ఆయన మాట్లాడారు. మట్టి తో గణేష్ ప్రతిమలను తయారు చేయండి అని పిలుపునిచ్చారు. గణపతి పూజలో వినియోగించే 21 పత్రి మొక్కలు నాటి వనాలు పెంచుదాం అన్నారు. రసాయనాలు భారలోహాలతో కూడిన రంగులు వాడవద్దు అన్నారు. మట్టి వినాయక ప్రతిమలను మాత్రమే పూజించండి అని కోరారు.సుమతిబాయి మాట్లాడుతూ మన సాంప్రదాయం ప్రకారం మట్టి, పసుపు, బియ్యం పిండితో మాత్రమే ప్రతిమలు తయారు చేయాలని కోరారు. రసాయనాలు భార లోహాలతో కూడిన రంగులు వాడవద్దు అని హెచ్చరించారు. వాటి వల్ల మన ఆహార చక్రం పాడవుతుందన్నారు. జీవావరణానికి ముప్పు ఏర్పడుతుందని వివరించారు. రసాయనాలతో కూడిన పసుపు కుంకుమ రంగులు వినియోగించ వద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏక్షన్ ఎయిడ్ సంస్థ ప్రతినిధి ఐ కృష్ణ కుమారి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జిఒ సమన్వయకర్త జె రాజేశ్వరి పాల్గొన్నారు

## సచివాలయాలు

# తనిఖీ చేసిన ఎండీఓ

**మాడుగుల, సెప్టెంబరు 8 జయ జయహే**

స్తానిక ఎండిఒ కే అప్పారావు మంగళవారం మండలంలో పలు సచివాలయాలు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పెన్షన్లు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించి సిబ్బందుకు పలు సూచనలు చేశారు.ఒమ్మలి, విజేపురం, పొంగలిపాక సచివాలయాలను సందర్శించిన ఆయన అక్కడ పారిశుధ్య పనులను కూడా పరిశిలీశీచారు. అలాగే ఒమ్మలి జగన్నాథపురం గ్రామ పంచాయితీలో నందు ఉపాధి పనులు జరుగుతున్న ప్రదేశాన్ని పరిశీలించి, ఉపాధి శ్రామికులతో పెన్షన్లు పారిశుధ్యం ఐజిఆర్ఎస్ కాల్స్ కోసం అవగాహన కల్పించారు.






## ఈ నెల 11న సామూహిక కుంకుమ అర్చన

**చోడవరం, సెప్టెంబర్ 8,జయ జయ హే**

చోడవరం శ్రీ కోపరేటివ్ కాలనీలో వేంచేసి యున్న శ్రీ ఆపదహర శ్రీనివాస క్షేత్రంలో కొలువైన శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వారి సన్నిధానంలో శ్రావణమాసం పురస్కరించుకొని ఈ నెల 11 న 108 మంది మహిళలు చే సామూహిక కుంకుమార్చన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు కార్యనిర్వహణ అధికారి కేబి ఆశ కిరణ్మయి ఆలయ ప్రధాన అర్చకులు గుంటూరు శాంతారామాచార్యులు సహాయ అర్చకులు శ్రీ వెంకట లక్ష్మీనారాయణ చార్యులు (వాసు) ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ వింజమూరి గౌరీ శంకర్ ప్రసాద్ తెలిపారు.కాబట్టి మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదాం చేయాలని కోరుతున్నారు.

## అక్రమంగా ట్రామడాల్ మత్తు

### ఇంజక్షన్లు అమ్మకాలు..5గురు అరెస్ట్

**జంగారెడ్డిగూడెం -జయ జయహే**

నిబంధనలకు విరుద్ధం గా ట్రామడాల్ (మత్తు ఇంజక్షన్లు) ఇంజక్షన్ లు రహస్యం గా అధిక ధరకు అమ్మిన పలువురు మెడికల్ ఏజెన్సీ నిర్వా హకులు జైలు పాలయ్యారు. జంగారెడ్డిగూడెం డీఎస్ పి బి వెంకటేశ్వర్లు మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో పలు వివరాలు తెలిపారు.నార్కో టిక్ (మదాక ద్రవ్య విభాగం) కు చెందిన మత్తు ఇంజక్షన్ లు హైదరాబాద్, గుజరాత్ లనుండి పెద్ద ఎత్తున కొనుగోలు చేసి ఆర్ ఎంపీ లకు ఎక్కువ ధరకు అమ్ముతున్న హోల్ సెల్ వ్యాపారులు ఈ కేసులో ఇరుక్కు పోయారు.మత్తు కలిగిగించే ట్రామాడాల్ మందు వున్న ఇంజక్షన్ లు భారీ స్థాయిలో తక్కువ రేటుకు కొనుగోలు చేసి తమ వద్దకు రెగ్యులర్ గా వచ్చే ఆర్ ఎం పి లు



ఇతరులకు వీరు గత కొంత కలగా అమ్ము తున్నారు. ఇటీ వలఇక్కడి వేగవరం హైస్కూల్ సమీపంలో ని తోటలో ట్రామడాల్ మందు కలిగిన ఖాళీ యాంపిల్స్,వాడిన సిరెంజ్ లు పెద్ద ఎత్తున లభ్యం మాయ్యాయి. స్థానికులు ఫిర్యాదు మేరకు రంగం లోకి దిగిన జిల్లా డగ్స్ కంట్రోల్ అధికారులు ఈగిల్ టీమ్ ఖాళీ యాం పిల్స్ మీద గల వివరాలప్రకారం దర్యాప్తు చేసి వాటిని కొనుగోలు చేసిన ఏజెన్సీ కి సంబందించిన కిషోర్ అనే డీలర్ ను అరెస్ట్ జేశారు.తాజా గా మరో 5గురిని అదుపులోకి తీసుకొని కోర్టు ఆదేశాల ప్రకారం రిమాండ్ కు తరలించినట్టు డి ఎస్ పి వెంకటేశ్వర్లు మీడియా కు తెలిపారు.అరెస్ట్ అయినవారిలో ఏలూరు సతీష్, ఏలూరు దుర్గా ప్రసాద్, దేవ రాజ శేఖర్, తమ్మి శెట్టి చిరంజీవి, మాధవరపు శివ వున్నారు. ఈ కార్యక్రమం లో డి ఎస్పి తో పాటు సి ఐ ఎం వి సుభాష్ ఎస్ ఐ వీర ప్రసాద్ ట్రాఫిక్ ఎస్ ఐ కుటుంబరావు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# ఆ విద్యార్థుల ధర్నాతో శ్యామ్‌కు సంబంధం లేదు!

### శ్యామ్' పై పోలీసు దాడుల పట్ల కన్నీటి ఆవేదన

**కాకినాడ, సెప్టెంబర్ 8: ( జయ జయహే)**

పోలీసు నియామకాల భర్తీ ప్రక్రియ చేపట్టాలని కోరుతూ నిర్వహించిన ధర్నాకు శ్యామ్ సంస్థకు విద్యార్థులు ఎటువంటి సంబంధం లేదని తాను తన శ్యామ్ ఇన్స్టిట్యూట్ అనే సంస్థ ద్వారా సమాజంలో ఉన్నత విలువలు కలిగిన పోలీసులను మాత్రమే తయారు చేయాలనుకుంటున్నానే గానీ నేరస్తులను తయారు చేయాలని ఉద్దేశం తనకు ఎటువంటి ఆలోచన లేదని శ్యామ్ అధినేత గుంటూరి తణుకులు (శ్యామ్) ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం తెల్లవారుజామున శ్యామ్ వసతి గృహంపై పోలీసులు దాడులు చేసి తనతో పాటు విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేయడం పట్ల ఆయన మీడియా ముందు కన్నీళ్ల పర్యంతమయ్యారు. మంగళవారం ఇన్స్టిట్యూట్లో శ్యామ్ సంస్థ డైరెక్టర్ శ్యామ్ పోలీసుల దాడులకు సంబంధించి విలేకరులకు వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా శ్యామ్ మాట్లాడుతూ మంగళవారం కాకినాడలో పోలీసు ఉద్యోగాలు భర్తీ చేయాలంటూ విద్యార్థులు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారన్నారు. దానిపై తనను పోలీసులు సోమవారం మధ్యాహ్నం పిలిచి రాత్రి వరకు విచారణ చేపట్టి



పంపారని చెప్పారు మంగళవారం ఉదయం తెల్లవారుజామునే వసతి గృహం పై పోలీసులు దాడులు చేసి విద్యను అభ్యసిస్తున్న వారిని భయభ్రాంతులకు గురి చేశారన్నారు. ఈ సంఘటనపై ఏదో కుట్ర కోణం ఉందని చెప్పారు. తాను ఎవరికి తోను వైరం లేదని అందరితోని సన్నిహితంగా ఉంటానని పోలీసులు ఇలా దాడులు చేసి సంస్థ ప్రతిష్టను దెబ్బతీశారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను తన భార్య ఉన్నత స్థాయి ప్రభుత్వ ఉద్యోగాలను వదులుకొని 26 సంవత్సరాల నుంచి సంస్థ అభివృద్ధి కోసం విద్యార్థులకు ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో దీనిని ఏర్పాటు చేశామన్నారు. తాను ఎన్నో సమస్యలు ఎదుర్కొని కూలి పని చేసుకుంటూ ఈ స్థితి చేరిన వాడినని ఈ సంస్థపై నమ్మకంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పోలీసు ఉద్యోగాల కోసం శిక్షణ నిమిత్తం చేరుతున్నారన్నారు. శిక్షణ పూర్తయిన అభ్యర్థులు చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారని ఒకే గదిలో ఇద్దరు ముగ్గురు ఉంటూ తిండి లేక కష్టాలు పడుతున్న తీరుని చూసి తాను ఆవేదన చెందుతున్నట్లు చెప్పారు. అందులో భాగంగా సీఎం చంద్రబాబును కలిసి పోలీసు శాఖలో ఉద్యోగాలు పెంచాలని కోరుతూ ఒక వినతిపత్రం అందించినట్లు కూడా శ్యామ్ గుర్తు చేశారు. విద్యార్థుల పైన కేసులు పెట్టినట్లు పోలీసులు చెప్పారని వారిపై ఎత్తివేయాలని తనపై పెట్టిన కేసుపై న్యాయపోరాటం చేస్తానని చెప్పారు. తన సమయాన్ని విద్యార్థులకు కేటాయించి వారిని ఉన్నత స్థితిలో చేర్చేందుకే కేటాయిస్తానని చెప్పారు. తన సంస్థపై జరిగిన దాడులకు సంబంధించి వివరాలు తెలుసుకుంటున్నానని తెలిసిన వెంటనే బహిర్గతం చేస్తానని శ్యామ్ విలేకరులకు చెప్పారు. ఇప్పటివరకు తమ ఇన్స్టిట్యూట్ ద్వారా 25 వేల మంది పోలీసులు (యూనిఫాం) ఉద్యోగాలు పొందారని శ్యామ్ చెప్పారు.

For a pure tomorrow..
జయహే

# ఆర్టీసీ పరిరక్షణకై ఎస్ డబ్ల్యూ ఎఫ్ నిరసన దీక్షలు

**అనకాపల్లి జయ జయహే**

రాష్ట్రంలో ఆర్టీసీలో ప్రవేశపెట్టనున్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రైవేట్ సంస్థకు ఇవ్వకుండా ఆర్టీసీ సంస్థ నడపాలని పినాకిల్ తో చేసుకున్న ఒప్పందం రద్దు చేయాలని నెల్లూరు2 డిపో పరిరక్షణకై కార్మికులు చేసిన పోరాటానికి మద్దతుగా మంగళవారం అనకాపల్లి ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద నిరసన దీక్షలు నిర్వహించారు ఈ దీక్షలను ఎస్ డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.ఎన్. వి పరమేశ్వర రావు ప్రారంభించగా దీక్షలో ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు బత్తిన అప్పారావు ఎస్ఆర్ త్రిమూర్తులు ఎంపీ నాయుడు ఈ ఎస్ రావు దీక్షలో పాల్గొనడం జరిగింది . ఈ దీక్షలకు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు వివి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై వారికి మద్దతు తెలియజేస్తూ ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎంతో చరిత్ర కలిగిన ఏపీఎస్ఆర్టీసీ ప్రైవేటీకరణ విధానాలు పెద్ద ఎత్తున అమరవుతున్నాయని ఈ విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు ఐక్యంగా పోరాటం చేస్తున్న ఏ ప్రభుత్వం అధికారశీల్లోకి వచ్చిన ప్రవేటికన చర్యలు దూకుడుగా అమలు చేస్తున్నాయని ఆయన అన్నారు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రైవేట్ కార్పొరేట్ సంస్థ అయిన పినాకిల్ సంస్థతో 1050 ఎలక్ట్రికల్ బస్సులను ఆ సంస్థ ద్వారా నడపాలని ఒప్పందం చేసుకోవడం అత్యంత దుర్మార్గమని వారు పేర్కొన్నారు దీంతో పాటు సంస్థకు రాష్ట్రంలోనే ఇప్పటికే నాలుగు డిపోలను దీర్ఘకాలంగా లీజు పద్ధతిలో ఇవ్వటాని కార్మికులు వ్యతిరేకించిన ఒప్పందం చేసుకున్నారని ఈ ఒప్పందాన్ని వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు ఎలక్ట్రికల్ బస్సులో ఆర్టీసీగా నడిపే విధంగా చర్యలు చేపట్టాలని వారి




డిమాండ్ చేశారు ఈ విధానాలు వ్యతిరేకంగా ఎస్ డబ్ల్యూ ఎఫ్ ఆధ్వర్యంలో గత 212 రోజులుగా నెల్లూరు 2 డిపో వద్ద నిరసన దీక్షను కొనసాగుతున్నాయని అత్యంత పోరాట పటిమతో కార్మికుల పోరాడుతున్నారని ప్రభుత్వం ఎప్పటికైనా తన ప్రైవేటీకరణ విధానాలు వెడనాడి ప్రజల ఆస్తిగా ఉన్న ఆర్టీసీ కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవాలని లేనట్లయితే యావన్మంది కార్మికుల ప్రజలతో భాగస్వామ్యతో ఈ ఉద్యమాన్ని మరి ఎంతో ఉధృతం చేస్తామని వారి హెచ్చరించారు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గంటా శ్రీరామ్ అనకాపల్లి మండల కాల తాతయ్య బాబు పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు బి ఉమామహేశ్వరరావు పెంటకోట శ్రీనివాసరావు అల్లు రాజు సిఐటి జిల్లా కమిటీ సభ్యులు డి శ్రీనివాసరావు ముఠా యూనియన్ నాయకులు ఎం రాము పార్సెల్ రాజు బి రాజు ఆర్టీసీ రిటైర్ ఉద్యోగుల సంఘం నాయకులు వి సత్యనారాయణ కే నాగేశ్వరావు ఏ వాణిశ్రీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ఏ ఎన్ పాత్రుడు రైతు సంఘం జిల్లా కోశాధికారి గండి నాయన బాబు తదితరులు పాల్గొన్నారు

# టీబీ నిర్మూలనలో ఏఎన్ఎంలు, ఆశాలదే కీలక పాత్ర




**తిరుపతి, సెప్టెంబర్08, జయ జయహే**

తిరుపతి టీబీ నిర్మూలనలో ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని హెల్త్ సూపర్వైజర్ కామరాజు సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారిణి డాక్టర్ శైలజ ఆదేశాల మేరకు ఎంఆర్‌పల్లె పట్టణ ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలకు వివిధ ప్రజారోగ్య అంశాలపై అవగాహన కల్పించారు.టీబీ లక్షణాలను ప్రారంభ దశలోనే గుర్తించి అనుమానితులను పరీక్షలకు పంపించాలని, చికిత్స పొందుతున్న వారు మందులను క్రమం తప్పకుండా తీసుకునేలా చూడాలని సూచించారు. హ్యాండ్‌హెల్డ్ ఎక్స్‌రే ద్వారా టీబీ అనుమానితులను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. అలాగే జాతీయ పోషకాహార మాసం సందర్భంగా సమతుల్య ఆహారంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, నషా ముక్త్ భారత్‌లో భాగంగా పొగాకు, మాదక పదార్థాలకు యువత దూరంగా ఉండేలా చైతన్యం తీసుకురావాలని కోరారు. ఈ-ఆశా యాప్‌లో వివరాల నమోదు, ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సిబ్బందికి సూచనలు ఇచ్చారు. అనంతరం ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వెంకటేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ల్యాబ్ టెక్నీషియన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జయహో బీసీ సభ జయప్రదం చేయండి

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ గౌరపాలెం టిడిపి ఇన్చార్జి పీల గోవింద సత్యనారాయణ కార్యాలయంలో మంగళవారం బిసి నాయకుల సమక్షంలో జరిగిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బీసీ గవర కార్పొరేషన్ చైర్మన్ మల్ల సురేంద్ర మాట్లాడుతూ నర్సీపట్నం ఈనెల 9వ తేదీన సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు జయహో బిసి పేరిట భారీ బహిరంగ సభను అంగరంగ వైభవంగా చింతకాయల విజయ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు బీసీలంతా భారీగా తరలివచ్చి ఈ సభను విజయంతో చేయాలని ఆయన బీసీలకు పిలుపునిచ్చారు నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన నాటి నుంచే బీసీలకు అత్యధిక రాజకీయ అవకాశాలు జక్కయ్యని అదే వరవడిని కొనసాగిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీదే అని ఆయన స్పష్టం చేశారు గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం లో జగన్మోహన్ రెడ్డి బీసీలకు 10 శాతం మేర పోత విధించి 24 శాతానికి తగ్గించగా ముఖ్యమైన నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో బీసీ ఎన్డీఏ కూటమి ప్రభుత్వం తిరిగి వాటిని 34 శాతానికి పెంచిందని మల్ల సురేంద్ర పేర్కొన్నారు ఈ రిజర్వేషన్ పెంపుతో రాష్ట్రవ్యాప్తంగా స్థానిక సంస్థల్లో సుమారు 53,936 మంది బీసీలు పోటీ చేసి



గెలుపొందే చారిత్రక అవకాశం లభిస్తుందని ఎంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు కి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కు నారా లోకేష్ కు బీసీ మంత్రి సవిత పాటు కూటమి ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు ఈ జయహో బిసి సభను ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారని ఆయన తెలియజేశారు బహిరంగ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి వివిధ బీసీ సంఘాల నాయకులు ప్రజా ప్రతినిధులు హాజరుకానున్నారని ఎంతటి మహత్తర అవకాశాన్ని కల్పించిన కోటమీ ప్రభుత్వానికి అండగా నిలవాల్సిన బాధ్యత బీసీలందరిపై ఉందని కాబట్టి ప్రతి ఒక్కరు ఈ సభకు విచ్చేసి తమ మద్దతును కృతజ్ఞతలు చాటి చెప్పాలని వారు కోరారు అనకాపల్లి నియోజకవర్గ బీసీ నాయకులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సోదరులంతా హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొణతాల రత్నకుమారి టిడిపి ఇన్చార్జి బొడ్డేడ జోగినాయుడు పోలార్పు త్రినాథ్ ఏపీ గవర్నర్ కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డెడ శ్రీనివాసరావు అధ్యక్షులు దాడి జగన్ బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పెదపాటి కళ్యాణి భక్తుల లక్ష్మి బిట్ల రాజు పైలా గోపి మల్ల సూరిబాబు నంద్యాల గణేష్ తదితరులు పాల్గొన్నారు

# కరెంటు స్మార్ట్ మీటర్లు బిగించడాని ఒప్పుకోము

**అనకాపల్లి జయ జయహే**

అనకాపల్లి పట్టణ పౌర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏపీ ఈపి డీసీఎల్ అనకాపల్లి సూపర్డెంట్ ఇంజనీర్ కార్య నిర్వాహక ఇంజనీరింగ్ అధికారులు కలిసి స్మార్ట్ మీటర్లు బిగించడానికి వ్యతిరేకిస్తూ పౌర సంక్షేమ సంఘం కన్వీనర్ బి ఉ మామహేశ్వరావు డిమాండ్లతో కూడిన మెమరాండం విద్యుత్ అధికారులకు మంగళవారం ఇవ్వడం జరిగింది విద్యుత్ వినియోగదారులపై ఒత్తిడి చేసి బెదిరించి స్మార్ట్ మీటర్లు బిగించడం నిరోధించాలని ఆదానే స్మార్ట్ మీటర్ల బిగింపును తక్షణమే నిలుపుదల చేయాలని వివిధ రకాల పేర్లతో వినియోగదారుల మోపుతున్న అదనపు చార్జీలను రద్దు చేయాలని విద్యుత్ ప్రవీణీకరణ విధానాలు వ్యతిరేకించాలని వారి డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సంఘం పౌర సంక్షేమ సంఘం కో కన్వీనర్ పెంటకోట శ్రీనివాసరావు మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బొడ్డేడ అప్పారావు కాళ్ళ తాలయ్య బాబు మధ్యల అప్పారావు జే రమేష్ బాబు గంటా శ్రీరామ్ పెంటకోట జగన్నాథం అల్లు రాజు తదితరులు పాల్గొన్నారు






# ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్లపై అవగాహన

**మాడుగుల,సెప్టెంబర్ 8,జయ జయ హే**

మాడుగుల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ భరోసా నూతన పెన్షన్లకు దరఖాస్తు చేసుకునేందుకు అవసరమైన పత్రాలు, అర్హతలు మరియు దరఖాస్తు విధానాలపై మహిళలకు అవగాహన కల్పించారు. మాడుగుల సచివాలయం--2లో జరుగుతున్న నూతన పెన్షన్ల కార్యక్రమాన్ని ఈ ఓ తో కలిసి పర్యవేక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా అవసరమైన సహకారం అందిస్తున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా మహిళలు కూటమి ప్రభుత్వానికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, పేదలు అర్హులైన కుటుంబాలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వానికి తమ కృతజ్ఞతలు తెలిపారు.

# 108 తామర పువ్వులతో వాసవి మాత విశేష పూజలు

**పాడేరు సెప్టెంబర్ 8 జయ జయహే**

పాడేరుల గల శ్రీ అయ్యప్ప స్వామి ఆలయంలో వేంచేసియున్న వాసవి మాత కు ఆఖరి శ్రావణ మంగళ వారం సందర్భంగా అమ్మవారి కి 116 తామర పువ్వుల తో విశేష పూజలు చందన అలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమం వనిత మోదమాంబ పాడేరు హిల్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.



# పెరుగుతున్న సైబర్ మోసాలు

నేటి కాలంలో సైబర్ మోసాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఎదో ఒకచోట ఎదో ఒక రకంగా వినియోగదారులు, ప్రజలు సైబర్ దాడులకు గురై మోసపోతూనే ఉన్నారు. తాజాగా.. మెటా సంస్థకు చెందిన ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు మోసగాళ్లు ఇతరుల పోస్టులపై కావాలనే తప్పుడు కాపీరైట్ ఫిర్యాదులు చేస్తున్నారు. ఆ తర్వాత వాటిని వెనక్కి తీసుకోవాలంటే డబ్బులు ఇవ్వాలంటూ బెదిరిస్తున్నారు. పదేపదే ఇలాంటి ఫిర్యాదులు వస్తే తమ ఖాతాలు శాశ్వతంగా బ్లాక్ అవుతాయనే భయంతో యూజర్లు వాళ్లు అడిగినంత ఇచ్చుకుంటున్నారు. 15 లక్షల మంది ఫాలోవర్లు ఉన్న ఒక ఇన్‌స్టాగ్రామ్ యూజర్, తన ఖాతాను కాపాడుకోవడానికి ఒక మోసగాడికి 50 డాలర్లు (రూ. 4700) చెల్లించినట్లు బీబీసీకి తెలిపారు. మెటా అప్పీల్ ప్రక్రియకు వారాల సమయం పడుతుందని, ఆ ప్రాసెస్‌లో వెళ్తే తనకు గతంలో వేల రూపాయల ఆదాయం పోయిందని ఆయన అన్నారు. “ఈ పరిస్థితి బాధితులకు ఎంత ఇబ్బందిగా ఉంటుందో మాకు అర్థమవుతోంది, ఇలాంటివి జరగకుండా నిరోధించేలానే మా వ్యవస్థలను తీర్చిదిద్దాం” అని మెటా ప్రతినిధి వివరించారు. “మా విచారణ తర్వాత, సదరు కంటెంట్‌ను మళ్లీ యథాస్థితికి తెచ్చాం. భవిష్యత్తులో ఇలాంటి దాడులు జరగకుండా ఖాతాలకు అదనపు భద్రతను కూడా కల్పించాం” అని తెలిపారు. కానీ, ఏది నిజమైన ఫిర్యాదో, ఏది నకిలీదో గుర్తించడంలో మెటా పనితీరు పేలవంగా ఉ ందని క్రియేటర్లు అంటున్నారు. నెలవారీ ఫీజు చెల్లించే క్రియేటర్ల అప్పీళ్లకు తప్ప, సాధారణ యూజర్ల ఫిర్యాదులకు సంస్థ త్వరగా స్పందించడం లేదని వారు బీబీసీతో చెప్పారు. ‘లాస్ట్ ఇన్ టైమ్ హిస్టరీ’ అనే ఇన్‌స్టాగ్రామ్ పేజీ పాత చారిత్రక చిత్రాలను పోస్ట్ చేస్తూ ఉంటుంది. దీనికి 15 లక్షలకు పైగా ఫాలోవర్లు ఉన్నారు. దీనిని నడిపే ఓలి ( పూర్తి పేరు చెప్పడానికి ఇష్టపడలేదు), తాను పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉన్న చిత్రాలను లేదా హక్కుదారుల అనుమతి ఉన్నవాటినే పోస్ట్ చేస్తున్నట్లు బీబీసీకి చెప్పారు. అయినా సరే, ఈ ఏడాదిలో అతనికి ఇప్పటివరకు డజన్ల కొద్దీ “స్పష్టంగా నకిలీ” కాపీరైట్ ఫిర్యాదులు వచ్చాయి. ఫిర్యాదులు వచ్చిన వెంటనే మెటా వాటి వాస్తవాన్ని చెక్ చేయదు. కాబట్టి ఎవరి ఖాతాపైనైనా ఇలా వరుసగా ఫిర్యాదులు వస్తే వాళ్ల అకౌంట్ తాత్కాలికంగా ఆగిపోతుంది. ఒకే ఈమెయిల్ ఐడీ నుంచి ఒకేసారి తన పలు పోస్టులపై కాపీరైట్ స్ట్రైక్స్ వస్తున్నాయని ఓలి చెప్పారు. ఆ తర్వాత ఆ ఫిర్యాదు చేసిన వ్యక్తి, టెలిగ్రామ్ లాంటి ప్రైవేట్ మెసేజింగ్ యాప్‌లోకి రమ్మని మెసేజ్ చేస్తాడు. “వాళ్లు కొంత డబ్బు డిమాండ్ చేస్తారు” అని ఓలి తెలిపారు. ఆ ఫిర్యాదును వెనక్కి తీసుకోవాలంటే సాధారణంగా కొన్ని వందల డాలర్లు అడుగుతారని చెప్పారు. డబ్బు అడగడం లేదా భవిష్యత్తులో మరిన్ని కాపీరైట్ ఫిర్యాదులు చేస్తామని బెదిరించడం లాంటి మెసేజ్‌లను బీబీసీ కూడా పరిశీలించింది. ఇన్‌స్టాగ్రామ్ తాత్కాలికంగా ఆపేసిన తన అకౌంట్‌ను తిరిగి తెచ్చుకోవడానికి ఓలి చివరికి ఒక మోసగాడికి క్రిప్టోకరెన్సీ రూపంలో 50 డాలర్లు ఇవ్వడానికి ఒప్పుకున్నారు. ఇలా డబ్బులు ఇస్తే నేరగాళ్లను ప్రోత్సహించినట్లే అవుతుందని, కాబట్టి డబ్బులు ఇవ్వొద్దని పోలీసులు బాధితులకు సూచిస్తున్నారు. మెటాను సంప్రదించి ఖాతాను వెనక్కి తెచ్చుకోవాలంటే వారాల కొద్దీ సమయం పడుతుంది కాబట్టి, వేగంగా పనైపోతుందనే ఉద్దేశంతోనే తాను “చివరి ప్రయత్నంగా” డబ్బు కట్టానని ఓలి అన్నారు. కానీ డబ్బు ఇచ్చిన వెంటనే మళ్లీ అతనికి కాపీరైట్ స్ట్రైక్స్ పడ్డాయి. “అదే అత్యంత బాధాకరమైన విషయం” అన్నారు ఓలి. “మనల్ని అంతలా టార్చర్ చేసినవాళ్లకే డబ్బులు సమర్పించుకోవడం, ఆ వెంటనే మళ్లీ వాళ్లు అదే పని చేయడం మనకు ఎంతో నరకంగా అనిపిస్తుంది” అన్నారు. కాపీరైట్ దావాలు ఎక్కువగా రావడంతో ఓలి ఖాతాకు మానిటైజేషన్ ఆగిపోయింది. అంటే, అతని పోస్టులు ఎంత వైరల్ అయినా ఇన్‌స్టాగ్రామ్ నుంచి అతనికి నయాపైసా రాదు. “ఇది వేధింపులా కాదా అని తెలుసుకోవడానికి లేదా అసలు ఏం జరుగుతుందో కనిపెట్టడానికి (మెటా నుంచి) వ్యవస్థలో కనీస విచారణ కూడా జరగడం లేదు” అని ఓలి అన్నారు. చాలా మంది ఇన్‌స్టాగ్రామ్ యూజర్లు కూడా ఇలాంటి అనుభవాలనే పంచుకున్నారు. “క్రియేటర్ల కోసమే తాము ఉన్నామని మెటా పైకి చెబుతున్నప్పటికీ, ఈ ప్రాసెస్‌లో వాళ్లు కనీస సాయం కూడా చేయలేదు. పైగా కస్టమర్ సపోర్ట్ కోసం డబ్బులు కట్టమంటారు” అని ‘మోర్బిడ్ క్యూరియాసిటీ’ పేజీని రన్ చేస్తున్న అభిన్ టామ్ సెబాస్టియన్ అన్నారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ‘బ్లూ టిక్’ (వెరిఫైడ్) కావడానికి మెటా నెలవారీ ఫీజు వసూలు చేస్తుంది, దీనివల్ల లైవ్ చాట్ ద్వారా 24 గంటలూ కస్టమర్ సపోర్ట్ దొరుకుతుంది. “నాకు రావాల్సిన అత్యంత కీలకమైన బ్రాండ్ కాంట్రాక్ట్‌లు వేరే క్రియేటర్ చేతికి వెళ్లిపోవడంతో నేను కోలుకోలేని దెబ్బ తిన్నాను. ఇలాంటివి మళ్లీ జరగవని చెప్పి మెటా నుంచి నాకు ఎలాంటి భరోసా గానీ సపోర్ట్ గానీ దొరకలేదు” అని సెబాస్టియన్ అన్నారు. కాగా, అసలైన కాపీరైట్ హక్కుదారులు లేదా వాళ్లు నియమించుకున్న ప్రతినిధులు మాత్రమే కాపీరైట్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేయగలరని ఇన్‌స్టాగ్రామ్ చెబుతోంది. బాధితులు నేరుగా ఆ హక్కుదారులనే సంప్రదించాలని సూచిస్తోంది. ఎద్దైనమైనా ఇలాంటి మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పోలీసుల సహాయం తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

Publisher suresh peddinti printed and published by him on behalf of SWANSIKAASRE PUBLICATIONS PUBLISHED AT 49-54-5/1, BALAYYASASTRY LAY OUT, VISAKHAPATNAM, 530013, 0891 2519333, 9603 22 3333, APTEL 2021/15454.feedback :jayajayahey@gmail.com